నేడు
విలేకరులు కావలెను
అనతి కాలంలోనే పత్రికారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన నేడు తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.
ఆసక్తి ఉన్నవారు
nedudailynews@gmail.comకు మీ బయోడేటాను పంపగలరు.
9848992874
9346984911

సంచలన వార్తలకు
నేడు
TELUGU DAILY


నేడు
విలేకరులు కావలెను
అనతి కాలంలోనే పత్రికారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన నేడు తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.
ఆసక్తి ఉన్నవారు
nedudailynews@gmail.comకు మీ బయోడేటాను పంపగలరు.
9848992874
9346984911

గురువారం-21.11.2024 | హైదరాబాద్ సంపుటి -2 సంచిక-205| పేజీలు -8 వెల: రూ.2
www.nedudailynews.com

# కాలుష్యం కోరల్లో ఢిల్లీ

- ఢిల్లీలో దారుణ పరిస్థితి
- ప్రభుత్వ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్!

2



న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం తీవ్రంగా పరిణమించిన నేపథ్యంలో నాలుగో దశ కార్యాచరణ ప్రణాళిక(జీఆర్ఏపీ-4)ను సోమవారం నుంచి అమల్లోకి తీసుకొచ్చారు. దీంతో ఆంక్షలు మరింత కఠినంగా మారాయి. ఇందులో భాగంగా ప్రాథమిక పాఠశాలలను పూర్తి మూసేశారు. 11, 12 తరగతులకు ఆన్‌లైన్ క్లాసులు నిర్వహిస్తున్నారు. సాఫ్ట్‌వేర్, ఇతర ఐటీ అనుబంధ సంస్థలను వర్క్‌ఫ్రమ్ హోంకు అనుమతించాలని ఆదేశించారు. తాజాగా, ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఇంటి నుంచి పనిచేయాలని ప్రభుత్వం సూచించింది.





# అబద్ధాలు రేవంత్‌రెడ్డి డీఎన్ఏ

మాజీ మంత్రి హరీశ్‌రావు

3



# 100 మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్

- ప్రభుత్వ పాఠశాలలో వికటించిన మధ్యాహ్న భోజనం
- పలువురు విద్యార్థులకు సీరియస్
- ఇందుకేనా విజయోత్సవాలు: హరీష్ రావు
- సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం

నారాయణపేట్ బ్యూరో, నేడున్యూస్: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం వికటించి 100 మంది విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారు. భోజనం చేస్తుండగా అకస్మాత్తుగా వాంతులు చేసుకుంటూ అస్వస్థతకు గురయ్యారు. నారాయణపేట్ జిల్లా మాగనూరు పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. విద్యార్థులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఒక విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఫుడ్ పాయిజన్‌కు సంబంధించిన కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్నా భోజనం వికటించి 100 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. నారాయణపేట్ జిల్లా మాగనూరు పాఠశాలలో చోటు చేసుకున్న ఈ ఘటన కలకలం రేపుతోంది. పాఠశాలలో మధ్యాహ్నా భోజనం చేస్తుండగా కొంత మంది విద్యార్థులు ఒక్కసారిగా వాంతులు చేసుకుంటూ కుప్పకూలిపోయారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు వెంటనే స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారిలో కొంత మందికి ప్రాథమిక చికిత్స అందించి ఇళ్లకు పంపించారు. 9 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో మెరుగైన చికిత్స కోసం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

8వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పాఠశాలలో ఫుడ్ పాయిజన్ విషయం తెలుసుకొని తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కొంత మంది విద్యార్థులకు స్కూల్‌లోనే

3

# కేటీఆర్ ఊచలు లెక్కబెట్టాల్సిందే

## సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి

4

కేసీఆర్ అసెంబ్లీకి రావాలి? కేసీఆర్ ఒక్కసారి అసెంబ్లీకి వస్తే అన్ని విషయాలు చర్చిద్దాం. 80 వేల పుస్తకాలు ఏం చదివావో మాట్లాడదాం. ప్రతి ఆడబిడ్డకు ఏడాదికి రెండు చీరలు ఇస్తాం. పరిశ్రమలు వస్తే మా పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని భూసేకరణ చేస్తున్నాం. భూసేకరణకు అధికారులు వస్తే దాడి చేస్తారా? భూసేకరణ చేయడం కేసీఆర్‌కు ఇష్టం లేదా? పరిశ్రమలు తెచ్చి మన పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వకూడదా? బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు భూములు సేకరించలేదా. అభివృద్ధి జరగాలంటే భూసేకరణ జరగాల్సిందే. అభివృద్ధి కోసం ఎవరో ఒకరు భూమి కోల్పోవాల్సిందే. భూమి కోల్పోతున్నవారికి మూడు రెట్ల పరిహారం ఇవ్వాలని నిర్ణయించాం.

– రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి



# గోల్డ్ బిస్కట్ పేరుతో కుచ్చుటోపి

## హైదరాబాద్‌లో భారీ స్కామ్





హైదరాబాద్, నేడున్యూస్: నగరంలో మరో భారీ మోసం వెలుగుచూసింది. గోల్డ్ బిస్కట్ పేరు చెప్పి ఓ సంస్థ ఏకంగా రూ.300 కోట్లు వసూలు చేసి బోర్డు తిప్పేసింది. 12 వెల్త్ క్యాపిటల్ సర్వీసెస్ పేరుతో కూకట్‌పల్లి కేంద్రంగా ఓ సంస్థ వ్యాపారం ప్రారంభించింది. తమ కంపెనీలో 8 లక్షల 8 వేలు పెట్టి రెండు గుంటల స్థలం కొంటే.. ప్రతి నెలా 4 శాతం చొప్పున రూ.32 వేలు తిరిగి చెల్లిస్తామని ప్రచారం చేశారు.

ఆ రకంగా 25 నెలలు చెల్లిస్తామంటూ ఈ కంపెనీ ప్రతినిధులు ప్రచారం చేశారు. దీంతో స్థలంతో పాటుగా డబ్బులు వెనక్కి వస్తాయంటూ నమ్మబలికారు. అలాగే ఈ స్కీమ్‌లోకి కొత్తగా ఎవరినైనా చేర్పిస్తే 25 నెలలపాటు ప్రతి నెలా రూ.7200 చొప్పున చెల్లిస్తామని ఆశ చూపించారు.అలాగే డబుల్ గోల్డ్ స్కీమ్ పేరుతో మరో మోసానికి కూడా పాల్పడ్డారు.

2

# ఎగ్జిట్‌పోల్స్‌లో ఎన్డీఏ హవా

- మహారాష్ట్ర, జార్ఖండ్‌లో బీజేపీ కూటమికే పట్టం
- మోజార్టీల సర్వేల అభిప్రాయం

ముంబయి: మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ సమరం ముగిసింది. ఈ నేపథ్యంలో విడుదలైన ఎగ్జిట్ పోల్స్ అంచనాల ప్రకారం మహారాష్ట్రలో బీజేపీ, ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని మహాయుతి కూటమి అధికారాన్ని నిలబెట్టుకునే అవకాశముఉంది. జార్ఖండ్‌లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే.. అధికార కూటమి జేఎం ఎం గట్టి పోటీ ఇవ్వడమే కాకు ండా ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని సర్వే లు చెబుతున్నాయి.

ఫలితంగా రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి కే ఎగ్జిట్ పోల్స్ పట్టం కట్టాయి. మహారాష్ట్ర, జార్ఖండ్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమయ్యే మెజారిటీ ఎన్డీయే కూటమి సాధిస్తుం దని అంచనా వేశాయి. ఇండియా కూటమి కూడా గట్టి పోటీ ఇచ్చిందని సర్వేలు తెలిపాయి. జమిలీ ఎన్నికలపై ఊహాగానాల నేపథ్యంలో ఈ ఎన్నికలను బీజేపీ, కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నాయి.

**రెండు రాష్ట్రాల్లోనూ..**

మహారాష్ట్రలో మొత్తం 288 అసెంబ్లీ స్థానాలు ఉండగా కావాల్సిన ఆధిక్యం 145. మూడు ఎగ్జిట్ పోల్స్‌లోనూ మహాయుతి కూటమి దాదాపు 158 సీట్లు గెలుస్తుందని చెప్పాయి. మ్యాట్రిజ్ ప్రకారం మహాయుతి 150 సీట్లు, మహావికాస్ అఘాడీ 110 సీట్లు రావచ్చని తెలిపింది. చాణక్య సర్వే ప్రకారం మహాయుతికి 152 నుంచి 160 సీట్లు,

2



# ఉగ్రవాదిలా అరెస్ట్ చేస్తారా?

- పోలీసుల తీరుపై హైకోర్టు ఆగ్రహం
- లగచర్ల ఘటనలో ఏ1గా కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి
- కింది కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను క్వాష్ చేయాలని హైకోర్టులో పిటిషన్
- తీర్పు రిజర్వ్ చేసిన హైకోర్టు

2





హైదరాబాద్, నేడున్యూస్: లగచర్ల దాడి ఘటనలో కింది కోర్టు ఇచ్చిన రిమాండ్ ఉత్తర్వులను క్వాష్ చేయాలంటూ పట్నం నరేందర్ రెడ్డి వేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. పోలీసుల రిమాండ్ రిపోర్టును పరిగణలోకి తీసుకున్న కొడంగల్ కోర్టు.. నిబంధనలకు విరుద్ధంగా రిమాండ్ విధించిందని ఈ ఉత్తర్వులను కొట్టి వేయాలని పట్నం నరేందర్ రెడ్డి పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. నరేందర్ రెడ్డి తరపున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్ రావు వాదనలు వినిపించారు.

పోలీసులు దాఖలు చేసిన మొదటి రిమాండ్ రిపోర్టులో పట్నం నరేందర్ రెడ్డి పేరు లేదని, నిందితులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా రెండో రిమాండ్ రిపోర్టులో నరేందర్ రెడ్డిని ఏ1గా చేర్చినట్లు పోలీసులు చెబుతున్నారని న్యాయవాది కోర్టుకు తెలిపారు. అధికారులపై దాడికి కుట్ర పన్నారని, ప్రజలను రెచ్చగొట్టినట్లు నరేందర్ రెడ్డిపై కేసులు నమోదు చేశారని.. దీనికి ఎలాంటి ఆధారాలు లేవని వాదించారు.

# నకిలీ రేషన్ కార్డులు కేంద్రం బిగ్ షాక్

- 20.4 కోట్ల రేషన్ కార్డుల డిజిటలీకరణ పూర్తి
- 5.8 కోట్ల నకిలీ రేషన్ కార్డుల ఏరివేత
- కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ: దేశంలో 5.80 కోట్ల నకిలీ రేషన్ కార్డులను తొలగించినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇప్పటివరకు 20.40 కోట్ల రేషన్ కార్డుల డిజిటలీకరణ పూర్తి అయినట్లు కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ పేర్కొంది. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా దేశంలో మొత్తంగా 80.60 కోట్ల మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందుతున్నారని తెలిపింది. ఆధార్ ధ్రువీకరణ, ఈ-కేవైసీ వెరిఫికేషన్‌ల ద్వారా దేశవ్యాప్తంగా 5.80 కోట్ల నకిలీ రేషన్ కార్డులను తొలగించినట్లు వివరించింది.

దేశవ్యాప్తంగా 5.33 లక్షల చౌక ధరల దుకాణాలకు ఈపోస్ పరికరాలు అందుబాటులో ఉన్నాయని కేంద్రం తెలిపింది. వీటి సాయంతో 99.8 శాతం కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేయగా, 98.7 శాతం లబ్ధిదారులకు బయోమెట్రిక్ ధ్రువీకరణ పూర్తైనట్లు వెల్లడించింది. ఈ-కేవైసీ ప్రక్రియతో ఇప్పటి వరకు 64 శాతం లబ్ధిదారుల వెరిఫికేషన్ పూర్తయ్యిందని కేంద్రం తెలిపింది. డిజిటైజేషన్ కారణంగా పీడీఎస్‌లో భారీ స్థాయిలో మార్పులు వచ్చినట్లు, తద్వారా ఆహార భద్రతలో ప్రపంచానికే కొత్త బెంచ్ మార్కును నెలకొల్పినట్లు అయ్యిందని కేంద్రం తెలిపింది.



ఇదిలా ఉండగా, ఆహార పదార్థాల సరఫరా విషయంలోనూ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పకడ్బందీగా వ్యవహరిస్తోందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. ఈ క్రమంలో సరకు రవాణాను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు వీలుగా ఓ వెహికల్ లొకేషన్ ట్రాకింగ్ సిస్టమ్‌నూ రైల్వేలతో అనుసంధానం చేశామంటూ తెలిపింది. ఇక వన్ నేషన్ - వన్ రేషన్ కార్డు పథకం వల్ల లబ్ధిదారులు దేశంలో ఎక్కడైనా సరకులు తీసుకునే అవకాశం ఏర్పడిందని పేర్కొంది.

# ఎగ్జిట్‌పోల్స్‌లో ఎన్డీఏ హవా

ఎంవీఏ 130 టైమ్స్ నౌ అంచనాలో మహాయుతి 159, ఎంవీఏ 116 సీట్లు గెలుచుకుంటాయని తెలిపాయి. జార్ఖండ్‌లోనూ ఎన్డీయే కూటమి మెజార్టీ మార్కు దాటుతుందని సర్వేలు చెబుతున్నాయి.

**రెండు కూటముల మధ్యే పోటీ**

మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల్లో ఎన్డీయే, ఇండియా కూటముల మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. మహారాష్ట్రలోని మొత్తం 288 స్థానాలకు గాను అధికార కూటమి మహాయుతి నుంచి బీజేపీ 149, శివసేన 81, ఎన్సీపీ 59 స్థానాల్లో పోటీ చేశాయి. విపక్ష మహావికాస్ అఘాడీ నుంచి కాంగ్రెస్ 101, శివసే న(యూబీటీ) 95, ఎన్సీపీ (ఎస్పీపీ) 86 సీట్లలో పోటీ చేశాయి. బీఎస్పీ ఒంటరిగా 237 స్థానాల్లో, ఎంఐఎం 17 స్థానాల్లో పోటీ చేశా యి. జార్ఖండ్‌లోని 81 సీట్లకు మెజారిటీ మార్కు 41. బీజేపీ 68, ఏజేఎస్‌యూ 10, జేడీయూ 2, ఎల్జీపీ ఒక చోట పోటీ చేశాయి. ఇండియా కూటమిలో జేఎంఎం 43, కాంగ్రెస్ 30, ఆర్జేడీ 6, సీపీఐ(ఎంఎల్) 4 స్థానాల్లో పోటీ చేశాయి. ఈ రెండు రాష్ట్రాల్లోనూ నవంబర్ 23న ఓట్ల లెక్కింపు జరగనుంది.



# పాక్‌లో ఆత్మాహుతి దాడి

పాకిస్తాన్‌లో ఆత్మాహుతి దాడి జరిగింది. బన్నూలోని సంయుక్త చెక్ పాయింట్ సమీపంలో పేలుడు వస్తువులతో ఉన్న ఒక వాహనాన్ని ఆత్మాహుతి దళ సభ్యుడు పేల్చివేశాడు. ఆ తరువాత అతని సహచరులు కాల్పులకు దిగారు. ఆ ఘటనలో 12 మంది పాకిస్తాన్ సైనికులు, ఆరుగురు ఉగ్రవాదులు మరణించినట్లు సైన్యం బుధవారం వెల్లడించింది. మరి ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఉగ్రవాదులు మంగళవారం రాత్రి పొద్దుపోయిన తరువాత బన్నూ జిల్లాలో మలిఖేల్ ప్రాంతంలో సంయుక్త చెక్ పోస్ట్‌పై దాడికి ప్రయత్నించారు. కానీ చెక్ పోస్ట్‌లోకి ప్రవేశించడానికి వారు చేసిన ప్రయత్నాన్ని భద్రత దళాలు అడ్డుకున్నాయని సైన్యం మీడియా విభాగం ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పిఆర్) తెలియజేసింది.

ఆత్మాహుతి పేలుదు వల్ల ప్రహరీ గోడలో కొంత భాగం కూలిపోగా, పక్కనే ఉన్న భవనం దెబ్బ తిన్నదని, ఆ ఘటనలో పది మంది భద్రత దళాల సైనికులు. ఫ్రాంటియర్ కాన్‌స్టబులరీకి చెందిని ఇద్దరు వెరసి 12 మంది జవాన్లు మృతి చెందినట్లు ఐఎస్‌పిఆర్ తెలిపింది. ఆ తరువాత జరిగిన కాల్పుల పోరులో ఉగ్రవాదులు ఆరుగురు హతమయ్యారని కూడా ఐఎస్‌పిఆర్ తెలిపింది. క్షతగాత్రులను ఒక స్థానిక ఆసుపత్రికి తరలించారు. 2021లో ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబాన్లు తిరిగి అధికారాన్ని పొందిన తరువాత పాకిస్తాన్‌లోని సరిహద్దు ప్రాంతాల వద్ద హింసాత్మక ఘటనలు పెరిగిపోయాయి.

# ఉగ్రవాదిలా అరెస్ట్ చేస్తారా?

దాడిలో పాల్గొన్న సమయంలో సురేశ్‌తో నరేందర్ రెడ్డి వందల సార్లు ఫోన్ మాట్లాడారనడానికి ఎలాంటి ఆధారాలు లేవని.. 71 రోజుల వ్యవధిలో 84సార్లు మాట్లాడినట్లు పోలీసులు ఇచ్చిన నివేదికలోనే ఉందన్నారు.

పట్నం నరేందర్ రెడ్డి అరెస్ట్ సమయంలో కనీస నిబంధనలు పాటించలేదని కుటుంబ సభ్యులకు సమాచారం కూడా ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ నేత ఆదేశాల మేరకు అలజడి సృష్టించడానికే దాడికి పాల్పడినట్లు నరేందర్ రెడ్డి వాంగ్మూలం ఇచ్చారని పోలీసులు పేర్కొనడంలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. ఈ మేరకు నరేందర్ రెడ్డి, సంబంధిత కోర్టుకు అఫిడవిట్ కూడా సమర్పించారన్నారు. ఫార్మా విలేజ్ కోసం భూసేకరణ చేపట్టే విషయాన్ని పట్నం నరేందర్ రెడ్డి బహిరంగంగా వ్యతిరేకించడంతో పాటు.. ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ హైకోర్టుకు తెలిపారు.

**ఉగ్రవాదిలా అరెస్టు చేయాల్సిన అవసరం ఏం వచ్చింది**

ప్రభుత్వంలో అస్థిరత సృష్టించాలన్నదే నరేందర్ రెడ్డి కుట్ర అని ఆయన వాదించారు. కేసు దర్యాప్తు దశలో ఉందని.. ఇప్పుడు నరేందర్ రెడ్డి పిటిషన్‌ను అనుమతిస్తే విచారణపై ప్రభావం చూపిస్తుందని పీపీ వాదించారు. నరేందర్ రెడ్డి అరెస్ట్ చేసిన తీరును హైకోర్టు తప్పుపట్టింది. మాజీ ఎమ్మెల్యేను కేబీఆర్ పార్కు వద్ద ఓ ఉగ్రవాదిలా అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ప్రశ్నించింది.

ఆయన ఏమైనా అజ్ఞాతంలోకి వెళ్లాడా అని పీపీని న్యాయమూర్తి అడిగారు. దాడికి గురైన అధికారులకు తగిన గాయాలేమో స్వల్పంగా ఉన్నట్లు వైద్యులు నివేదిక ఇచ్చారని పోలీసులేమో తీవ్ర గాయాలుగా పేర్కొంటున్నారని హైకోర్టు తప్పుపట్టింది. లక్ష్మణ్, దేవేందర్, హన్మంత్ ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా నరేందర్ రెడ్డిని ప్రధాన నిందితుడిగా చేర్చినట్లు పోలీసులు పేర్కొంటున్నారని.. ఆ ముగ్గురి వాంగ్మూలాలు కోర్టుకు సమర్పించాలని పీపీని హైకోర్టు ఆదేశిస్తూ తీర్పును రిజర్వ్ చేసింది.

**కొడంగల్ కోర్టుకు పట్నం నరేందర్ రెడ్డి**

మరోవైపు పట్నం నరేందర్ రెడ్డిని చర్లపల్లి జైలు నుంచి కస్టడీ పటిషన్ నిమిత్తం కొడంగల్ కోర్టుకు తీసుకెళ్లారు. నరేందర్ రెడ్డిని కొడంగల్‌కు తీసుకువస్తున్నారన్న సమాచారంతో ఆయన అభిమానులు పెద్ద ఎత్తున కోర్టు వద్దకు చేరుకున్నారు. పట్నంకు మద్దతుగా సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పట్నం సతీమణి సహా కుటుంబ సభ్యులు సైతం ఆయనను చూసేందుకు కోర్టుకు వచ్చారు. కొడంగల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ముందు ఆయనను హాజరు పరిచారు. కస్టడీ పిటిషన్‌పై ఇరువర్గాల న్యాయవాదులు తమ వాదనలు వినిపించగా వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును ఈనెల 22కు రిజర్వ్ చేశారు. అనంతరం పట్నం నరేందర్ రెడ్డిని తిరిగి చర్లపల్లి జైలుకు తరలించారు.

# ఆస్తిలో వాటా ఇవ్వాలని మామపై ట్రాఫిక్ కానిస్టేబుల్ దాడి

ఆస్తిలో వాటా ఇవ్వాలని మామపై ట్రాఫిక్ కానిస్టేబుల్ దాడికి పాల్పడిన సంఘటన లంగర్‌హౌస్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. లంగర్‌హౌస్‌కి చెందిన కానిస్టేబుల్ ఎండి షాహిద్ ఖాన్ అనే వ్యక్తి గత కొద్దీ రోజులుగా మామ ఆస్తిలో తనకు కూడా వాటా ఇవ్వాలంటూ ఇందిరానగర్‌లో ఉంటున్న మామ అబ్దుల్ వాహిద్‌పై దాడికి పాల్పడ్డాడు. తనకి ఆస్తిలో వాటా ఇవ్వకపోతే మామ కుటుంబ సభ్యులందరి అంతు చూస్తానాంటూ బెదిరింపులకి పాల్పడ్డాడు. తనను ఎవరు ఏమి చేయలేరంటూ మామ కుటుంబం షాహిద్‌ఖాన్‌పై చిందు లేశారు. తమకు కానిస్టేబుల్ షాహిద్ నుంచి ప్రాణ హాని ఉందంటూ బాధితుడు అబ్దుల్ మోహిద్ జూబ్లీహిల్స్ పోలీసులకు పిర్యాదు చేశాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఆ వివరాలైతే.. తెలియదు

- సొంతూళ్లలోనే కుటుంబ వివరాలు వెల్లడిస్తాం
- ఎన్యూమరేటర్లకు చుక్కలు చూపిస్తున్న జనాలు
- తెలంగాణలో సాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే
- ఫ్రిజ్‌లు, ఏసీలు, సెల్‌ఫోన్‌లు, ద్విచక్ర వాహనాల వివరాలు చెప్పని జనాలు
- ఎప్పటిలాగే సాగుతున్న ఎన్యూమరేటర్ల కష్టాలు

హైదరాబాద్, నేడున్యూస్: రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర కుటుంబ సర్వే వేగంగా సాగుతోంది. కొన్ని చోట్ల ఎన్యూమరేటర్లు అడిగిన ప్రశ్నలన్నింటికీ కొందరు సమాధానాలు చెప్పగా.. మరికొంత మంది తాము అసలు సమాధానాలు చెప్పం అన్నట్లు మాట్లాడుతున్నారు. మరోవైపు సర్వేలో ఫ్రిజ్‌లు, టీవీలు, ఏసీలు, ద్విచక్రవాహనాలు, ఏసీలు గురించి వివరాలు వెల్లడిస్తే ప్రభుత్వ పథకాలు ఆగిపోతాయని సోషల్ మీడియా విపరీతమైన ట్రోలింగ్స్ జరుగుతున్నాయి. కానీ వారం రోజుల క్రితం మంత్రి పొన్నం ప్రభాకర్ ఇచ్చిన ప్రకటనతో, వాటి ఇన్ఫర్మేషన్ ఇచ్చినా ఎలాంటి ఇబ్బంది ఉండదని ప్రభుత్వ పథకాలు ఆగిపోవని తెలిపారు. అయినా సరే ఇంకా చాలా మంది పూర్తి సమాచారం ఇవ్వటం లేదని గణకులు చెబుతున్నారు.

ముఖ్యంగా స్థిర, చరాస్తుల వివరాలు చెబితే తమకు ఎక్కడ ప్రభుత్వ పథకాలు ఇవ్వరోననే భయంతో వివరాలు చెప్పడం లేదు. అలాగే ద్విచక్ర వాహనాలు, కార్లు, టీవీలు, ట్రాక్టర్లు, స్మార్ట్‌ఫోన్లు ఉన్నా లేవంటూ ఎన్యూమరేటర్లను పక్కదారి పట్టిస్తున్నారు. ఈ వివరాలు ఇచ్చిన ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పినా సరే వినిపించుకోవడం లేదు. ఈ విషయంపై మంత్రి కూడా క్లారిటీగా ఈ వస్తువుల వివరాలు ఇస్తే ఎలాంటి ప్రభుత్వ పథకాలు ఏవీ ఆగిపోవనీ, ఇంకా ఏవైనా పథకాలు ఇవ్వడానికి ఆస్కారం ఉందని చెబుతున్నా.. కొందరు మాత్రం వినడం లేదు.

ఉపాధి కోసం వేరే ప్రాంతాల్లో ఉంటున్న వారు అయితే తమ వివరాలను సొంతూళ్లలోనే ఇస్తామంటూ సర్వేను దాటవేస్తున్నారు. దీంతో సర్వేకు సహకరించని వారి నుంచి సంతకం తీసుకుంటున్నామని ఎన్యూమరేటర్లు



చెబుతున్నారు. ఇప్పుడు ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తుందో చూడాలి.. ప్రభుత్వం, అధికారులు ఎంత చెప్పిన ప్రజలు వినకపోవడంతో సమగ్ర కుటుంబ సర్వేలో రోజుకూ తక్కువ నమోదు శాతం అవుతున్నాయి. తక్కువ శాతం నమోదవుతున్న చోట్ల ప్రత్యేక సిబ్బందిని పంపించి ప్రక్రియ వేగవంతం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని చోట్ల చిరునామాలు మిస్ : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈనెల 26 నాటికి సర్వేను పూర్తి చేసేలా ఉన్నతాధికారులు చెబుతున్నారు. ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించి సర్వే సరళిని ఎప్పుటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అలాగే సిబ్బందికి అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఒక్కో ఇంట్లో 75 అంశాలను ప్రశ్నించి, వివరాలు సేకరించాలి. కానీ కొన్ని చోట్ల కుటుంబ యజమానుల నుంచి సహకారం కరవు అవుతుంది. సర్వేకు వెళ్లినప్పుడు ఇంటి వద్ద ఎవరూ లేకపోవటం, మొదట ఒకే కుటుంబంగా నమోదు చేసుకున్నప్పటికీ వేర్వేరుగా వివరాలు తీసుకోవాలని కోరుతున్నారు. కొన్ని చోట్ల ఇంటి చిరునామా సరిగ్గా లేకపోవడంతో సర్వేలో కొంతమేర జాప్యం జరుగుతోంది.

# రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ



హోంమంత్రి లేని తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని బీజేపీ అధికార ప్రతినిధి రాణి రుద్రమ విమర్శించారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దాడులు రోజు రోజుకీ పెరిగి పోతున్నాయని ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ వరంగల్ సభ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ మహిళల పేరుతో పెట్టిన సభ కాదని, మహిళలను వంచించి పెట్టిన సభ అని వ్యాఖ్యానించారు. తెలంగాణలో అలాంటి పరిస్థితుల్లో మహిళా విజయోత్సవాలు చేసుకునే అర్హత రేవంత్ రెడ్డికి ఎక్కడిదని ప్రశ్నించారు. అడ్డమైన తిట్లు తిట్టినంత మాత్రాన పరిపాలన చేసినట్లు కాదని, రేవంత్ రెడ్డి ఇకనైనా పాలనపై దృష్టి పెట్టాలని కోరారు.

50 ఏళ్లపాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి మహిళల సంక్షేమం పట్ల సోయి లేకుండా పాలించడం సిగ్గుచేటని, మహిళల గురించి మాట్లాడే అర్హత రేవంత్ రెడ్డికి లేదని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకుపోవడానికి పనిచేయాలని, బీజేపీని, ప్రధాని నరేంద్ర మోడీని, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పట్ల ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం పరిపాలన దక్షత అనిపించుకోదన్న సంగతి గుర్తుంచుకోవాలని తెలిపారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి బీజేపీని విమర్శించడం బంద్ చేసి, మందిని తొక్కుడు బంద్ చేసి, మహిళలను ముంచుతూ, మోసం చేయడం ఆపి పరిపాలన మీద శ్రద్ధపెట్టాలని విమర్శించారు.

# విద్యార్థులకు ఫుడ్ పాయిజన్



వైద్యుల సమక్షంలో చికిత్స అందిస్తున్నారు. పాఠశాల వద్దకు వచ్చిన మీడియా ప్రతినిధులను, తల్లిదండ్రులను సిబ్బంది అడ్డుకోవడంతో కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు పాఠశాల వద్దకు వచ్చి ఉపాధ్యాయులు, సిబ్బందిని విచారించి వివరాలు తెలుసుకున్నారు. ఉడకని అన్నం పెట్టారని విద్యార్థులు చెబుతున్నారు.

**ఇందుకేనా విజయోత్సవాలు: హరీష్ రావు**

ఈ ఘటనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలా? లేక ప్రాణాలు తీసే విషవలయాలా? అంటూ ఘాటుగా ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో వరుసగా జరుగుతున్న ఫుడ్ పాయిజన్, ఇతర ఘటనల గురించి ఆయన ప్రస్తావించారు. వాంకిడి గిరిజన గురుకులంలో ఫుడ్ పాయిజన్‌తో అనారోగ్యం పాలై ఓ విద్యార్థిని 20 రోజులుగా నిమ్స్ ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై కొట్టుమిట్టాడుతోందని హరీష్ రావు చెప్పారు. నల్గొండ జిల్లాలో పాముకాటుకు గురైన విద్యార్థి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు.

రాష్ట్రంలోని గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో అసలేం జరుగుతోందని హరీష్ రావు ప్రశ్నించారు. 'పాఠాలు నేర్చుకోవడం కాదు, ప్రాణాలతో బయటపడితే చాలు అనే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందుకేనా విజయోత్సవాలు జరుపుతున్నది. ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇంకా ఎంత మంది విద్యార్థులు బలి కావాలి?' అని హరీష్ రావు ట్వీట్ చేశారు.

**ఘటనపై సీఎం ఆగ్రహం**

హైదరాబాద్: మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలితే సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

ఈ ఘటనలో అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకుని, కార ణాలేమిటో దర్యాప్తు చేసి బాధ్యులెవరో నివేదిక సమర్పించాలని అధికారులను సీఎం ఆదేశించారు.ఇలాంటి సంఘటనలను పునరావృతం కాకూడదని సీఎం హెచ్చరించారు. వెంటనే అన్ని జిల్లాల కలెక్టర్లను అప్రమత్తం చేశారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించే విషయంలో రాజీపడేది లేదని, ఎక్కడైనా ఇ లాంటి ఘటనలు జరిగితే బాధ్యులపై కఠినం గా వ్యవహారిస్తామని సీఎం స్పష్టం చేశారు.

# అభ్యర్థుల్లో మళ్లీ అదే టెన్షన్

## జీవో 29పై విచారణ వాయిదా

తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 29 పై విచారణను హైకోర్టు నవంబర్ 26 కు వాయిదా వేసింది. తెలంగాణలో ఇప్పటికే గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు ముగిశాయి.. పరీక్షలు ముగిసిన సరే జీవో 29 రద్దు కోరుతూ ఇంకా అభ్యర్థులు ఆందోళన చేస్తూనే ఉన్నారు. అయితే, తాజాగా బుధవారం హైకోర్టులో జీవో 29 పై విచారణ జరగాల్సి ఉండగా.. ధర్మాసనం మళ్లీ విచారణను వాయిదా వేసింది.. ఇప్పటికే.. గ్రూప్ 1 పరీక్షలు ముగిసినా జీవో 29 పై తేలకుండా ఫలితాలు వెల్లడించవద్దని ఇప్పటికే సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఈరోజు హైకోర్టులో జరిగే విచారణపై అభ్యర్థుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

జీవో 29 పై తేలకుండానే ప్రభుత్వం పరీక్షలు నిర్వహించిందని ఇప్పటికే అనేక మంది అభ్యర్థులు ఆందోళన చేస్తున్నారు.. అక్టోబర్ నెలలో అభ్యర్థుల ఆందోళనల నడుమనే ప్రభుత్వం మెయిన్స్ పరీక్షలు నిర్వహించింది. పరీక్షలు రద్దు కోరుతూ గతంలోనే అభ్యర్థులు సుప్రీంకోర్టును సైతం ఆశ్రయించారు. చివరి నిమిషంలో సుప్రీంకోర్టును ఆశ్రయించినందున తాము జోక్యం చేసుకోలేమని హైకోర్టులోనే తేల్చుకోవాలని అభ్యర్థులకు స్పష్టం చేసింది. దీంతో బుధవారం జీవో 29 పై హైకోర్టులోనే తమకు న్యాయం జరుగుతుందని అభ్యర్థులు ఆశాభావం వ్యక్తం చేసారు. అయితే దీనికి సంబంధించిన విచారణ ఈ నెల 26 కు హై కోర్టు వాయిదా వేసింది.

రిజర్వేషన్లతో ముడిపడి ఉన్న జీవో 29 పై




రాజకీయ రగడ సైతం తార స్థాయికి చేరింది. పరీక్షలు మొదలయ్యే సమయంలో అభ్యర్థులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 29 ద్వారా అణగరిన వర్గాలకు చెందిన అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆందోళన చేసిన అభ్యర్థులకు మద్దతుగా ప్రతిపక్ష పార్టీలు సైతం ఉద్యమించాయి. అన్ని ఆందోళనల నడుమ మెయిన్స్ పరీక్షలు ప్రభుత్వం సజావుగా నిర్వహించింది. దీంతో ఇక తమ ఆశలన్నీ హైకోర్టు పైనే పెట్టుకున్నారు అభ్యర్థులు. జీవో 29 పై గత కొన్ని నెలలుగా అభ్యర్థులు న్యాయపోరాటం చేస్తూనే ఉన్నారు. అయితే ఇప్పుడు పరీక్షలు కూడా ముగియటతో జీవో 29 పై హైకోర్టు ఏం చెప్తుంది అనే ఉత్కంఠతో అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.

# కాలుష్యం కోరల్లో ఢిల్లీ

దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్య తీవ్రత రోజు రోజుకూ పెరుగుతోంది. దీంతో గాలి నాణ్యత దారుణంగా పడిపోయింది. వరుసగా ఏడో రోజూ వాయు నాణ్యతా సూచీ (AQI) 400లకు పైగా నమోదయ్యింది. కాలుష్యం ప్రమాదకర స్థాయిని మించిపోవడంతో ఇప్పటికే కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నారు. తాజాగా, ఢిల్లీ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ ఉద్యోగులు ఇంటినుంచే పని చేయాలని ఆదేశించింది. కాలుష్య తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి గోపాల్‌రాయ్ ప్రకటించారు. ''దేశ రాజధాని ఢిల్లీ నగరంలో పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించే చర్యలు చేపట్టాం.... ఇందులో భాగంగా 50 శాతం ప్రభుత్వ ఉద్యోగులు ఇంటి నుంచే పని చేయాలని ఆదేశించాం.... ఈ అంశంపై సచివాలయ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించనున్నాం' అని మంత్రి గోపాల్‌రాయ్ ఎక్స్ (ట్విట్టర్),లో పోస్ట్ చేశారు. అలాగే, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆఫీసుల ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, మిగతా ప్రభుత్వ కార్యాలయాలు ఉదయం 10 నుంచి సాయంత్రం 6.30 వరకు పనిచేస్తాయని ఆయన చెప్పారు.

ఇప్పటికే ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు పాఠశాలలను మూసివేయగా.. పది, 12 వ తరగతుల విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నారు. వాయుకాలుష్యం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో అక్కడి ప్రజలు తీవ్ర



ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పీల్చేగాలి విషంగా మారడంతో అనారోగ్యానికి గురవుతున్నారు. బుధవారం ఉదయం గాలి నాణ్యత సూచీ సగటు 422గా నమోదైంది. చాలా ప్రాంతాల్లో ఇది 500 మార్క్‌ను దాటడంతో వాతావరణ శాఖ అధికారులు ఆందోళన చెందుతున్నారు.

పొగమంచుతో ఇప్పటికే పలు విమానాలు, రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సుప్రీంకోర్టు విచారణకు లాయర్లు వర్చువల్ మోడ్‌లో పాల్గొని తమ వాదనలు వినిపించొచ్చని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆదేశించారు. వాయు కాలుష్యం నియంత్రణకు కృత్రిమ వర్షం (Cloud seeding) కురిపించేలా చర్యలు తీసుకోవాలని కేంద్రానికి మంత్రి గోపాల్‌రాయ్ విజ్ఞప్తి చేశారు. ఇక, గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్‌ఏపీ)-4 అమల్లోకి రావడంతో బీఎస్-4 ఇంజిన్, డీజీల్ సాయంతో నడిచే భారీ వాహనాల రాకపోకలను నిషేధించారు. కేవలం నిత్యావసరాలను తీసుకొచ్చే వాహనాలకు మాత్రమే అనుమతి ఉంది. బీఎస్-3 పెట్రోల్ వాహనాలపై కూడా బ్యాన్ విధించారు. శీతాకాలం ప్రారంభానికి ముందే ఢిల్లీలో గాలి నాణ్యత తగ్గిపోగా.. దీపావళి మర్నాడు నుంచి మరింత్ర తీవ్రరూపం దాల్చింది.

# కుచ్చుటోపి

ఈ స్కీమ్‌లో కనీసం నాలుగు లక్షలు పెట్టుబడి పెట్టిన వారికి సంవత్సరం తర్వాత రూ.8 లక్షలు విలువ జేసే స్విట్జర్లాండ్ గోల్డ్ బిస్కట్ ఇస్తామంటూ 12 వెల్త్ క్యాపిటల్ సంస్థ ప్రచారం చేసింది. అలాగే గోల్డ్ చిట్ స్కీమ్ కింద 20 నెలల కాలానికి గానూ ఐదు లక్షలు డిపాజిట్ చేస్తే.. ప్రతి నెలా 15000 చొప్పున 19 నెలలు చెల్లిస్తామని.. ఆఖరి నెలలో మరో 15 వేలు ఎక్స్‌ట్రా కూడా ఇస్తామంటూ ప్రజలకు ఆశచూపించారు. దీనిని నమ్మి సుమారుగా 3600 మంది ఈ సంస్థలో డిపాజిట్లు చేశారు. ఈ మొత్తం రూ.300 కోట్లు వరకూ ఉంటుందని అంచనా. ఇంతా జరిగాకా ఆ సంస్థ బోర్డు తిప్పేయటంతో ఖాతాదారులు ఆందోళన చెందుతున్నారు.

దీనిపై సైబరాబాద్ పోలీసులను బాధితులు ఆశ్రయించగా.. బాధితుల ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు8 మందిని అరెస్ట్ చేశారు. 12 వెల్త్ క్యాపిటల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ సహా మొత్తం 8 మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరికొందరు పరారీలో ఉండగా.. వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. అయితే రోజూ ఇలాంటి ఘటనలు పేపర్లు, టీవీల్లో చూస్తున్నప్పటికీ జనంలో అవగాహన కలగడం లేదని కొందరు అభిప్రాయపడుతున్నారు. జనం ఆశలను క్యాష్ చేసుకునే ఇలాంటి వారిపై గట్టిచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మరోవైపు పరారీలో ఉన్నవారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.





## అన్యమతస్థులు న్యాయం చేయలేరు

గుడిమల్కాపూర్, నేడు న్యూస్: తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యోగ బాధ్యతల్లో హిందూ సంప్రదాయాలపై అవగాహన లేని అన్యమతస్తులు న్యాయం చేయలేరని, టీటీడీ బోర్డు పాలకమండలి నిర్ణయాలను సమర్థిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ గుడిమల్కాపూర్ డివిజన్ ఉపాధ్యక్షుడు గన్నాల రంగారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా గన్నాల రంగారెడ్డి మాట్లాడుతూ.. శ్రీవాణి ట్రస్టు రద్దు చేసి టీటీడీ ఖాతాకు శ్రీవాణి ట్రస్ట్ అకౌంట్ అనుసంధానం చెయ్యడం ముదావాహమన్నారు.

## 90.56 లక్షల ఇండ్లలో సర్వే పూర్తి

హైదరాబాద్, నేడు న్యూస్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ, కుల గణన రాష్ట్రంలో ముమ్మరంగా కొనసాగుతుంది. బుధవారం వరకు 90,56,383 నివాసాలలో సర్వే పూర్తి అయ్యింది. ఈ సమగ్ర ఇంటింటి సర్వేలో మొత్తం 1,16,14,349 నివాసాలు గుర్తించగా... ఇందులో నేటివరకు 90.56,383 లక్షల నివాసాలను సర్వే పూర్తిం చేసి 78 శాతం సాధించంది. నేటి వరకు రాష్ట్రంలో ములుగు జిల్లా అత్యధికంగా 97,552 నివాసాలు సర్వే చేయాల్సి ఉండగా లక్ష్యంని మించి 98,080 నివాసాలను సర్వేచేసి 100.5 శాతం సాధిచింది మొదటి స్థానంలో నిలిచింది. జనగాం జిల్లా 99.9 శాతం, పూర్తిచేసి రెండో స్థానంలో నిలిచింది. నల్గొండ 97.7 శాతంతో తృతీయ స్థానంలో వుంది. అదేవింధగా కామరెడ్డి 93.3 శాతం, మంచిర్యాల 93.2శాతం, యాదాద్రి 92.3 శాతం, నిజామబాద్ 91శాతం, రాజన్న సిరిసిల్ల 90.9 శాతం, జగిత్యాలు 90.6 శాతం, 9 జిల్లాలో కూడా 90 శాతం పైగా సర్వేపూర్తి అయ్యింది. గ్రేటర్‌లో కూడా సర్వే ప్రక్రియ ఊపు అందుకుంది. జీహెచ్ఎంసీ పరిధిలో 25,05,517 నివాసాలు సర్వే చేయాల్సి ఉండగా... నేటి వరకు 13,91,817 నివాసాలు సర్వే పూర్తిచేసి 55.6 శాతం సాధించింది. ఈ సర్వేకు ప్రజల నుండి మంచి స్పందన ఉందని అధికారులు వివరించారు. 52, 493 గ్రామీణ, 40 ,901 అర్బన్ బ్లాకులుగా మొత్తం 92,901 బ్లాకులుగా విభజించి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జరుగుతోంది. ఈ సర్వే సకాలంలో పూర్తి చేసేవిధంగా జిల్లా ఇన్‌చార్జ్ అధికారులు కలెక్టర్‌లు ఎప్పటికప్పుడు సమీక్షించి తగిన చర్యలు తీసుకుటున్నారు.

## కేంద్ర మాజీ మంత్రి చిదంబరానికి ఊరట

ఎయిర్సెల్ మ్యాక్సిస్ మనీలాండరింగ్ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ సీనియర్ నేత , మాజీ ఆర్థిక మంత్రి పి. చిదంబరానికి ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయనపై విచారణకు అనుమతిస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను న్యాయస్థానం నిలిపివేసింది. సింగిల్ జడ్జి ధర్మాసనం ఈ మేరకు ఈడీకి నోటీసులు జారీ చేసింది. ఎయిర్‌సెల్ మ్యాక్సిస్ కేసులో చిదంబరం, ఆయన కుమారుడు కార్తీ చిదంబరంపై ట్రయల్ కోర్టులో ఈడీ ఛార్జిషీట్‌లు దాఖలు చేసింది. దీంతో ఆయనపై విచారణకు ట్రయల్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

అయితే ఈ ఉత్తర్వులను నిలిపివేయాలంటూ చిదంబరం హైకోర్టును ఆశ్రయించగా, తాజాగా ఆయనపై విచారణను నిలిపివేసింది. చిదంబరం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఎయిర్‌సెల్ మ్యాక్సిస్ ఒప్పందంలో పారిస్ ఇన్వెస్టిమెంట్ ప్రమోషన్ బోర్డు అనుమతుల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమం లోనే చిదంబరంతోపాటు ఆయన కుమారుడు కార్తీ చిదంబరంపై కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి సీబీఐ, ఈడీ రెండు వేర్వేరు ఛార్జిషీట్లను 2018 లో దాఖలు చేశాయి.



## బట్టల దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం

హైదరాబాద్ నగర శివారు అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శివారాంపల్లిలో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. శ్రీ లక్ష్మీ క్లాత్ టెక్స్టైల్స్ దుకాణంలో దురదృష్టవశాత్తు భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. ఒక్కసారిగా దట్టమైన పొగలు వ్యాపించడంతో కాలనీ వాసులు ఉక్కిరిబిక్కిరయ్యారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. విద్యుదాఘాతంతో ప్రమాదం సంభవించినట్లు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ భారీ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగనందున అందరు ఊపిరి పీల్చుకున్నారు. సుమారు రూ.25లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న అత్తాపూర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఇలాంటి అగ్ని ప్రమాదాల నుంచి కాపాడుకోవడానికి వ్యాపారం చేసే షాపులు ఫైర్ సేఫ్టీకి సంబంధించిన పరికరాలను భవనాలకు బిగించుకోవాలని పోలీసులు సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే మంటలు చెలరేగకుండా అదుపులోకి తీసుకోవచ్చని చెప్పారు. లేదంటే భారీగా ప్రాణ నష్టం కానీ ఆస్తి నష్టం లాంటివి సంభవిస్తాయని చెబుతున్నారు. పెద్ద పెద్ద వ్యాపారాలు చేసేటప్పుడు ఆ భవనాలకు వద్దకు అగ్నిమాపక వాహనాలు వెళ్లే వసతి కచ్చితంగా ఉండేలా చూసుకోవాలని, అలా ఉంటేనే కార్యకలాపాలు కొనసాగించాలని సున్నితమైన హెచ్చరికతో చెప్పారు. లేదంటే మంటలు త్వరగా చుట్టు పక్కల భవనాలకు వ్యాపించి తీవ్రమైన ప్రాణ, ధన, ఆస్తి నష్టం చేకూరుస్తుందని తెలిపారు. అగ్ని నిరోధక యంత్రాలను తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు.

# ఆస్తి పన్ను వసూలు చేయరా?

- ఇంటి నెంబర్లు లేవు.. పన్నులు చెలించరు
- మేడ్చల్ మున్సిపాలిటీలో ఏం జరుగుతోంది?
- పట్టించుకోని మేడ్చల్ కలెక్టర్, అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)?

మేడ్చల్, నేడు న్యూస్: పట్టణ స్థానిక సంస్థల గురించి ఎంత తక్కువగా చెప్పుకుంటే అంత మంచిది. ఏ యూఎల్‌బీలో చూసినా అవినీతి కంపు కొడుతోంది. గత ప్రభుత్వ హయాంలో నూతన మున్సిపల్ చట్టం రూపొందించి అందినంత దండుకునే వ్యవహారానికి తెరలేపితే... హస్తం పార్టీ పాలనలోనూ అదే అవినీతి కొనసాగుతోంది. ఇందుకు ఉదాహరణలుగా పలు యూఎల్‌బీలలో వెలుగులోకి వస్తున్న అవినీతి, అక్రమాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పర్యవేక్షణ లోపం.. ఎంఏయూడీ ముఖ్యకార్యదర్శి దాన కిశోర్ నిర్లక్ష్యం.. జిల్లాల అదనపు కలెక్టర్లు(స్థానిక సంస్థ) నిర్లిప్తత... పుణ్యమాని యూఎల్‌బీలలో అధికారులు, పాలక వర్గాలు మాఫియాగా మారిపోయాయనేది నిర్విదాంశంగా మారింది.

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని పలు దుకాణాలు, ధాబాలకు ఆస్తి పన్ను వసూళ్లలో మినహాయింపు ఇచ్చారా? లేదంటే ఆస్తి పన్ను చెల్లించకుండా మాఫీ చేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏళ్ల తరబడి మేడ్చల్‌లోని దుకాణాలు, దాబాలు ఆస్తి పన్ను చెల్లించడం లేదని తెలిసింది. ఆస్తి పన్ను చెల్లించకుంటే మేడ్చల్ మున్సిపల్ కమిషనర్, మేడ్చల్ అదనపు కలెక్టర్(స్థానిక సంస్థ)లు ఏం చేస్తున్నారు? ఎందుకు ఆస్తి పన్ను గురించి పట్టించుకోవడం లేదు? పాలక మండళ్లు ఏం చేస్తున్నాయి? అనేది అంతుచిక్కడం లేదు. ఏకంగా ఇంటి నెంబర్లు సైతం లేవంటే ఏమనుకోవాలి?

### ఆస్తి పన్ను చెల్లించరా?

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని కిష్టాపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే షెటర్లు ఉన్నాయి. ఈ షెటర్లకు ఇంటి నెంబర్లు లేవు. అంతేకాకుండా కొన్ని ఏళ్ల నుంచి




మున్సిపాలిటీకి టాక్స్ కట్టిన దాఖలాలు లేవన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఈ షెటర్లను అద్దెకివ్వడం జరిగింది. ప్రతినెల అద్దె మాత్రం తీసుకుంటున్నారే తప్ప మున్సిపాలిటీకి చెల్లించాల్సిన టాక్స్ మాత్రం చెల్లించడం లేదని ఆరోపణలున్నాయి. ఇదేవిధంగా మేడ్చల్ పట్టణంలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ ధాబా పైన సైతం విమర్శలు వస్తున్నాయి. ఈ దాబా సైతం మున్సిపాలిటీకి టాక్స్ చెల్లించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### పన్నులు చెల్లించడం లేదు

ఈ విషయంపై నేడు ప్రతినిధి సంబంధిత బిల్ కలెక్టర్ పెంటయ్యను వివరణ కోరగా... కిష్టాపూర్ రోడ్‌లో ఉన్న షటర్లతో పాటు జాతీయ రహదారిపై ఉన్న ధాబాకు టాక్స్‌లు చెల్లించాలంటూ ఒత్తిడి తెచ్చినా వారు పట్టించుకోవడం లేదన్నారు. షటర్ల యజమానులు ఇంతవరకు ఎలాంటి పేపర్లను మున్సిపాలిటీలో




అందజేయకపోవడం వల్ల షెటర్లకు ఇంటి నెంబర్లు ఇవ్వలేకపోయామని తెలిపారు. దీంతో పాటు గత కొంతకాలంగా షెటర్ల యజమానులు మున్సిపల్ టాక్స్ సైతం కట్టడం లేదన్నారు.

## రంగనాథ స్వామి ఆలయ అభివృద్ధికి సహకరిస్తాం

వనపర్తి, నేడు బ్యూరో: రంగనాథ స్వామి ఆలయ అభివృద్ధికి సహకరిస్తామని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి హామీ ఇచ్చారు. బుధవారం కలెక్టర్ సతీసమేతంగా శ్రీరంగాపురంలోని శ్రీదేవి భూదేవి సహిత రంగనాథ స్వామిని దర్శించుకున్నారు. ఆలయంలో కలెక్టర్ దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. అనంతరం కలెక్టర్ ఆలయ ప్రాంగణంలో కలియతిరిగి పరిసరాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి సహకారం ఉంటుందని తెలిపారు. ఆలయంలో ఉన్న మ్యూజియంలో ఏర్పాటు చేసిన పెయింటింగ్స్ ను తిలకించారు. ఆలయానికి సమీపంలో ఉన్న సర్వ వర్గ సామూహిక భవనం, టూరిజం గెస్ట్ హౌస్‌ను కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. అతిథి గృహంను బాగు చేసి వెంటనే వాడుకలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా సామూహిక భవనానికి వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసి వాడుకలోకి తీసుకురావాలన్నారు. తహశీల్దార్





మురళి, ఆలయ సిబ్బంది, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## అబద్దాలు రేవంత్‌రెడ్డి డీఎన్ఏ

మహబూబ్‌నగర్ బ్యూరో: మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ కలుపు మొ క్క కాదని..కల్పవృక్షం అని మాజీ మం త్రి, సిద్దిపేట ఎంఎల్ఎ హరీశ్‌రావు అ న్నారు. మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంఎల్ఎలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, చిట్టెం రాం మోహన్ రెడ్డి, గువ్వల బాలరాజు తదితరులతో కలిసి బుధవారం ఆయన దేవరకద్ర నియోజకవర్గం,

సిసికుంట కురుమూర్తి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ..ఇవ్వాల రైతులు టివిల దగ్గర తమ పిల్లలను కూర్చోనీయడం లేదని.. పొరపాటున టివి ఆన్ చేస్తే సిఎం రేవంత్ రెడ్డి బూతు మాటలే వినిపిస్తున్నాయని, ఒక సిఎంగా ఉండి ఆ బూతులు ఏంది.. అలా మాట్లాడవచ్చునా? అందుకే కెసిఆర్ రైతు సిఎం అయితే, రేవంత్‌ను బూతుల సిఎం అని జనం అంటున్నారని ఎద్దేవా చేశారు. 'కురుమూర్తి స్వామి మీద ఒట్టేసి చెబుతున్నా .. ఆగస్టు పదిహేనులోగా రైతు రుణమాఫీ చేస్తానని రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ప్రజలకు మాటిచ్చారు.. మరి ఆ మాటపై నిలబడ్డారా.. నేను వస్తూ వస్తూ నిల్విడి గ్రామంలో రుణమాఫీ అయ్యిందా అని రైతులను అడిగాను.. వారు కాలేదు' అని అన్నారని తెలిపారు.

ఇటీవల రేవంత్ రెడ్డి కురుమూర్తి స్వామి దర్శనానికి వచ్చారని, అయితే మాటతప్పానని కురుమూర్తి స్వామి దగ్గర ప్రాయశ్చిత్తం చేసుకుంటారని అనుకున్నాను..కానీ ఆయన చేసుకోలేదని వ్యాఖ్యానించారు. 'వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తానని బాండ్ పేపర్ మీద రాసిచ్చారు కనబడిన చర్చిల మీద, దర్గాలు, దేవాలయాల మీద ఒట్టు పెట్టి పంద్రాగస్టులోగా రుణమాఫీ చేస్తానన్నారు.. మాట మీద నిలబడ్డారా? సిఎం రేవంత్‌కు మాటలు ఎక్కువ చేతులు తక్కువ' అని మండిపడ్డారు. కాంగ్రెస్ వరంగల్ సభలో సిఎం 45 నిమిషాలు ప్రసంగం చేస్తే కెసిఆర్‌ను 50 సార్లు గుర్తు చేసుకున్నారని..అంటే రేవంత్‌కు నిద్రలో కూడా కెసిఆరే గుర్తుకు వస్తున్నారని, అయినా కెసిఆర్‌ను లేకుండా చేస్తానంటున్నారని ధ్వజమెత్తారు. 'పాలకుడే పాపం చేస్తే ఆ రాజ్యానికే అరిష్టం అంటారుపాలకుడు దేవుని మీద ఒట్టు పెట్టి మాట తప్పిన పాపాత్మున్ని కాపాడాలని కురుమూర్తి స్వామిని దర్శించుకొని కోరుకున్నాం' అన్నారు. 42 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తానని చెప్పి ఈ పుణ్యాత్ముడు 20 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేశారన్నారు. ఇప్పటికీ సగం కంటే ఎక్కువ మంది రైతులకు రుణమాఫీ కాలేదని విమర్శించారు.

అంటున్నారునేను రెడీగానే ఉన్నా.. రైతులకు మేలు జరిగితే రాజీనామాకు సిద్ధంగా ఉన్నా' అని అన్నారు. వరంగల్‌లో గతంలో




ఇదే పార్టీ రైతు డిక్లరేషన్ చేసిందిఇందులో 9 రకాల హామీలు ఇచ్చారన్నారు. మరి ఇందులో ఒక్కటైనా అమలు చేశావా అని నిలదీశారు. 'వరంగల్ డిక్లరేషన్‌లో రైతు బంధు పదిహేను వేలన్నారు..అది అమలు కాలేదు..అన్ని రకాల పంటలకు బోనస్ అన్నారు.. రైతు రుణమాఫీ అన్నారు ..సగం కౌలు రైతులకు న్యాయం చేస్తామన్నారు.రైతు కూలీలలకు రూ.12 వేలు ఇస్తామన్నారు. ఇదీ అమలు కాలే ఇచ్చిన హామీల్లో ఒక్కటంటే ఒక్కటంటే అమలు చేశావా' అంటూ నిలదీశారు. 'ఇవ్వాల మహబూబ్ నగర్ జిల్లా ప్రజల పరువు తీస్తున్నారు.. పాలమూరు ప్రజలు అంటే నీతిbంతులు, మాట తప్పనోళ్లు..కానీ ఈ జిల్లాకు చెందిన రేవంత్ రెడ్డి మాట తప్పి పాలమూరు పేరును చెడగొడుతున్నారు' అని విమర్శించారు. ప్రతిపక్షంపై పగ పట్టడం.. ప్రజలకు దగా చేయడమే రేవంత్ ఎజెండా అని అన్నారు. రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత రైతు బంధు, కెసిఆర్ కిట్లు..న్యూట్రిషన్ కిట్, బతుకమ్మ పండుగ చీరలు, గొల్ల కుర్మలు గొర్రెలు, బిసి బంధు, దళిత బంధు ఇలా అన్నీ కోల్పోయింది నిజం కాదా అని నిలదీశారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రకాల ట్యాక్స్‌లు వచ్చాయన్నారు. బిల్లులు కావాలంటే 8 నుంచి 10 శాతం ట్యాక్స్ కట్టాల్సి వస్తోందన్నారు. ఇళ్లు కట్టాలంటే ఆర్ ట్యాక్స్ వచ్చిందన్నారు. చదరపు గజానికి వంద రూపాయలు ఇవ్వాలట. కొత్త ట్యాక్సులు వచ్చాయన్నారు. రెండు లక్షలు పైగా ఉన్న వారు రుణం కట్టుకోండంటే రైతులు బంగారు తాకట్టు పెట్టి వడ్డీలు తెచ్చుకొని అప్పు చెల్లిస్తే వారికి ఇంతవరకు రైతు రుణమాఫీ కాలేదన్నారు.

## నేడు రాష్ట్రానికి జస్టిస్ ఘోష్

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ విచారణ పునఃప్రారంభానికి రంగం సిద్ధమైంది. విచారణ నిమిత్తం జస్టిస్ పినాకి చంద్రఘోష్ గురువారం సాయం త్రం హైదరాబాద్ వస్తున్నారు. డిసెంబరు 5వ తేదీ వరకు రాష్ట్రంలోనే ఉండనున్నారు. విచారణలో భాగంగా శనివారం(23వ తేదీ) నుంచి క్రాస్ ఎగ్జామినేషన్ చేయనున్నారని సమాచారం. ఎవరెవరినీ విచారణకు పిలవాలనే అంశంపై శుక్రవారం నిర్ణయం తీసుకునే అవకాశముంది. ఈ నెలాఖరున లేదా డిసెంబరు తొలి వారంలో విచారణలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటాయని అధికారులు భావిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టుల నిర్మాణంపై విధాన నిర్ణయం తీసుకున్న వారితోపాటు ఆ నిర్ణయాల్లో భాగస్వాములైన మాజీ కీలక ప్రజాప్రతినిధులను విచారణకు పిలిచే అవకాశాలున్నాయి.

## ఈసీ కొరడా..

### ఏడుగురు పోలీస్‌ల సస్పెన్షన్

ఉత్తరప్రదేశ్ ఉప ఎన్నికల్లో ఓటర్ గుర్తింపు కార్డుల తనిఖీలకు సంబంధించి బుధవారం నాడు తలెత్తిన వివాదంపై ఎన్నికల కమిషన్ కొరడా ఝుళిపించింది. సమాజ్‌వాదీ ఇచ్చిన ఫిర్యాదు మేరు ఓటర్‌గైడ్‌లైన్స్ ఉల్లంఘనకు పాల్పడిన ఏడుగురు పోలీస్‌లను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్టు ఆదేశాలిచ్చింది. సస్పెండైన వారిలో కాన్పూర్,ముజఫర్‌నగర్ జిల్లాలకు చెందిన చెరో ఇద్దరు అధికారులు, మొరాదాబాద్ నుంచి ముగ్గురు అధికారులు ఉన్నారు. ఉత్తరప్రదేశ్ లోని ఘజియాబాద్, కతెహారి, ఖైర్, కుందర్కి, కర్హాల్, మజవాన్, మీరాపూర్, ఫుల్పూర్,సిషామౌ అసెంబ్లీ నియోజకవర్గాల్లో బుధవారం ఉప ఎన్నికల పోలింగ్ జరుగుతోంది. పోలీస్ అధికారులు చట్టవిరుద్ధంగా ఓటరు కార్డులు, ఆధార్ కార్డులు తనిఖీ చేస్తున్నారని, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ఈసీకి ఫిర్యాదు చేశారు. కొన్ని కమ్యూనిటీలను ఓటు వేయకుండా నిరోధిస్తున్నారని, దీనిపై ఈసీ చర్యలు తీసుకోవాలని కోరారు. తాము ఎన్ని ఫిర్యాదులు చేసినా సరే నెగ్గాలని బీజేపీ కోరుకుంటోందని, అధికార యంత్రాంగంపై ఒత్తిడి తెస్తోందని ఆరోపించారు.



## తేమశాతం తేలగానే తూకం

### –వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

శ్రీరంగాపూర్, నేడు బ్యూరో: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యంలో తేమశాతం నిర్దేశించిన స్థాయిలో వచ్చిన వెంటనే తూకం వేసి లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం శ్రీరంగాపురం మండల పరిధిలో రంగాపూర్, నాగరాల గ్రామాల్లో, పెబ్బేరు మండల పరిధిలోని చెలిమిళ్లలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యంలో తేమశాతం నిర్దేశించిన స్థాయిలో వచ్చిన వెంటనే తూకం వేసి లోడ్ చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలగకుండా టెంట్ వేసి, ఫ్లెక్సీ కట్టడంతో పాటు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలన్నారు.

### రైస్ మిల్లుల సందర్శన

శ్రీరంగాపూర్ మండల పరిధిలోని అల్ హాజీ ఆగ్రో ఇండస్ట్రీస్, పెబ్బేరు మండల పరిధిలోని శ్రీ సప్తగిరి ఇండస్ట్రీస్‌ను కలెక్టర్ సందర్శించారు. పీపీసీల నుంచి వచ్చే ధాన్యం దింపుకోవడంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అనే విషయంపై ఆరా తీశారు. పీపీసీల నుంచి వచ్చే ధాన్యం తేమ శాతం సరిగ్గా ఉంటుందా లేదా అని చెక్ చేశారు.

మిల్లర్లు ధాన్యం దింపుకున్న తర్వాత తప్పకుండా ట్రక్ షీట్ పత్రాన్ని ఫోటో తీసి పిపిసికి పంపాలని సూచించారు.

## జాతీయ రహదారుల పనుల్లో వేగం పెంచండి

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

హైదరాబాద్: జాతీయ రహదారులు రాష్ట్ర ప్రగతికి వెన్నెముకల్లాంటివని, వాటి నిర్మాణంలో అలసత్వానికి తావివ్వొద్దని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులకు సూచించారు. భూ సేకరణ, అటవీ అనుమతులు వంటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకుంటూ పని చేయాలన్నారు. జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించిన వివరాలను ప్రతి వారం నివేదిక రూపంలో సమర్పించాలన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎన్‌హెచ్‌ఏఐ తెలంగాణ రీజియన్ అధికారి శివశంకర్, అధికారులతో కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రానికి మంజూరైన జాతీయ రహదారుల గురించి పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు గతాన్ని వదిలేసి.. రోడ్ల నిర్మాణ పనులను పరుగులు పెట్టించాలని సూచించారు. రహదారుల నిర్మాణంలో ఎలాంటి సమస్యలున్నా.. తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. 24గంటలు తాను అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. హైదరాబాద్-డిండి (ఎన్‌హెచ్-765) 85 కిలోమీటర్ల రోడ్డు అలైన్‌మెంట్ పెండింగ్‌లో ఉందని అధికారులు ప్రస్తావించగా.. రెండు రోజుల్లో సీఎం రేవంత్‌తో సమావేశమై అలైన్‌మెంట్ ఖరారు చేస్తామని కోమటిరెడ్డి పేర్కొన్నారు.

ఆ వెంటనే డీపీఆర్‌ను సిద్ధం చేసి, పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్-విజయవాడ (ఎన్‌హెచ్-65) మార్గంలో గుర్తించిన బ్లాక్ స్పాట్ పనులను పూర్తిచేయడానికి ఇంకా రెండేళ్ల కాలపరిమితి ఉందని అధికారులు చెప్పగా.. కాలపరిమితితో సంబంధం



లేకుండా పనుల్లో వేగం పెంచి, త్వరితగతిన పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. హైదరాబాద్-మన్నెగూడ (ఎన్‌హెచ్-163)రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలన్నారు. అలాగే, హైదరాబాద్-నాగ్‌పూర్ (ఎన్‌హెచ్- 44) మార్గంలోని రెండు ప్యాకేజీలు, హైదరాబాద్-బెంగళూరు హైవేలోని మూడో ప్యాకేజీ పనుల గురించి మంత్రి ఆరా తీశారు. వీటి విషయంలో భూ సేకరణ పెద్ద సమస్యగా మారిందని అధికారులు తెలపగా.. రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. వీటితోపాటు కర్నూల్-రాయచూర్ (ఎన్‌హెచ్-150సీ) గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పనుల వివరాలను మంత్రి అడగ్గా.. రెండో ప్యాకేజీలో టన్నెల్స్ నిర్మించాల్సి ఉందని, 2025 డిసెంబరు వరకు పనులు పూర్తవుతాయని అధికారులు పేర్కొన్నారు.




# యూఎస్ ఎంబసీపై రష్యా గురి

- ఉక్రెయిన్‌లోని యూఎస్ దౌత్యకార్యాలయంపై దాడికి రష్యా ప్లాన్!
- అందుకే ఎంబసీని ఖాళీ చేశామన్న అగ్రరాజ్యం!

**ఉక్రెయిన్‌లోని తమ రాయబార కార్యాలయాన్ని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు అమెరికా పేర్కొంది. కీవ్‌లోని తమ దౌత్య కార్యాలయంపై రష్యా బుధవారం భారీ వైమానిక దాడులకు పాల్పడే అవకాశం ఉందని తమకు సమాచారం వచ్చిందని అగ్రరాజ్యం వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే ఎంబసీని మూసివేయాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. నవంబర్ 20న దాడి జరగబోతోందని తమకు కచ్చితమైన సమాచారం అందిందని పేర్కొంది. రాయబార కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది. ఎయిర్ అలర్ట్‌లు ప్రకటించగానే కీవ్‌లోని మెరికా పౌరులు షెల్టర్లలోకి వెళ్లిపోవాలని కోరింది.**

### అమెరికా బాటలో ఇటలీ, గ్రీస్, స్పెయిన్

రష్యా దాడి చేయవచ్చనే అనుమానాలు ఉన్న నేపథ్యంలో పలు దేశాలు కూడా అమెరికా బాటలోనే నడిచాయి. ఇటలీ, గ్రీస్, స్పెయిన్‌లు కూడా ఉక్రెయిన్‌లోని తమ ఎంబసీలను తాత్కాలికంగా మూసివేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

### అగ్నికి ఆజ్యం!

రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం మరింతగా ముదురుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రష్యా పైకి దీర్ఘశ్రేణి క్షిపణుల ప్రయోగానికి ఉక్రెయిన్‌కు అమెరికా అనుమతివ్వడంతో అగ్నికి ఆజ్యం పోసినట్లైంది. దీంతో ఆగ్రహించిన రష్యా అధ్యక్షుడు పుతిన్ అణ్వాయుధాల వినియోగానికి అనుమతించే నిబంధనలను మరింత సరళతరం చేసే కీలక దస్త్రంపై సంతకం చేశారు. అణ్వాయుధాలు కలిగి ఉన్న దేశం సాయంతో ఏ దేశమైనా తమపై దాడి చేస్తే, దాన్ని సంయుక్త దాడిగానే పరిగణిస్తామని అందులో పేర్కొన్నారు.

మరోవైపు అమెరికా ఇచ్చిన అనుమతితో ఉక్రెయిన్ ఏకంగా ఆరు దీర్ఘశ్రేణి క్షిపణుల్ని (ఆర్మీ టాక్టికల్ మిస్సైల్ సిస్టమ్) రష్యా పైకి ప్రయోగించింది. ఇందులో ఐదింటిని కూల్చేశామని, మరో దాన్ని ధ్వంసం చేశామని రష్యా ప్రకటించింది. ఈ యుద్ధం మరింత తీవ్రమయ్యే అవకాశాలు ఉండడం వల్ల, పొరుగునున్న ఐరోపా దేశాలు అప్రమత్తమయ్యాయి. చిన్న పిల్లల ఆహార పదార్థాలు, ఔషధాలు, తాగునీటిని నిల్వ చేసుకోవాలని కొన్ని నాటో దేశాలు తమ ప్రజలకు సూచించాయి.

### అణుయుద్ధ జరిగేనా?

అగ్రరాజ్యాలు అమెరికా, రష్యా చర్యలు ప్రపంచాన్ని అణుయుద్ధం వైపు నెడుతున్నాయా అనే అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య నానాటికీ ముదురుతున్న యుద్ధ తీవ్రతను చూస్తుంటే ఈ అనుమానాలకు మరింత బలం చేరుకూరుతోంది. ఒకవైపు అమెరికా దీర్ఘశ్రేణి క్షిపణుల ప్రయోగానికి ఉక్రెయిన్‌కు అనుమతివ్వడమే కాక వాటిని పెద్దఎత్తున తరలిస్తోంది. మరోవైపు అందుకు ధీటుగా అణ్వాయుధాల వినియోగానికి అనుమతించే నిబంధనలను సరళతరం చేసి అమెరికాకు పరోక్షంగా తీవ్ర హెచ్చరికలు పంపిన రష్యా, ఇప్పుడు నేరుగా అగ్రరాజ్యం దౌత్యకార్యాలయాలపై దాడులు సిద్ధమైనట్లు తెలుస్తుండడం అగ్నికి ఆజ్యం పోసినట్లైంది. అటు నాటో కూటమిలో సభ్య దేశమైన యూకే ల్యాండ్‌మైన్లు, పేలుడు పదార్థాలను ఎలా నిర్వీర్యం చేయాలో ఉక్రెయిన్ దళాలకు శిక్షణ ఇస్తుండడంతో రష్యాకు మింగుడు పడడం లేదు. అదీనూ తమ సొంతగడ్డపై ఉక్రెయిన్ సైన్యానికి యూకే శిక్షణ ఇస్తుండడం రష్యాకు ఆగ్రహం తెప్పిస్తోంది.

### అమెరికా-రష్యా మధ్య నో హాట్‌లైన్!

రష్యా-అమెరికా మధ్య అపార్థాలను తొలగించుకోవడానికి ఏర్పరుచుకున్న హాట్‌లైన్ వ్యవస్థ ప్రస్తుతం వాడుకలో లేదని క్రెమ్లిన్ ప్రకటించింది. ఈ విషయాన్ని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ధ్రువీకరించారు. రష్యా-అమెరికా అధ్యక్షుల మధ్య చర్చలు జరపేందుకు ఓ సురక్షిత కమ్యూనికేషన్ వ్యవస్థ ఉండేదని, ప్రస్తుతం అది వినియోగంలో లేదని దిమిత్రి పేర్కొన్నారు. క్యూబా మిసైల్ సంక్షోభం తలెత్తిన సమయంలో అపార్థాలకు తావివ్వకుండా ఉద్రిక్తతలు తగ్గించుకునేందుకు అనువుగా రష్యా-అమెరికా 1963లో హాట్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేసుకొన్నాయి. అంత వరకూ టెలిగ్రామ్‌లపై ఆధారపడిన ఇరు దేశాలు హాట్‌లైన్ అందుబాటులోకి వచ్చాక, నేరుగా అధ్యక్షుడితో ఫోన్‌లో మాట్లాడే అవకాశం లభించింది. పైగా దానిలో వీడియో కూడా ప్రసారం చేయగలిగేలా ఉండేది. కానీ అది ఇప్పుడు వినియోగంలో లేదని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ పేర్కొన్నారు.

# కేటీఆర్ ఊచలు లెక్కబెట్టాల్సిందే

ఈ మేరకు వేములవాడలో జరిగిన ప్రజాపాలన- ప్రజా విజయోత్సవ సభకు ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి విచ్చేసి ప్రసంగించారు. ఆనాడు పాదయాత్రలో భాగంగా వేములవాడ రాజన్నను దర్శించుకుని మాట ఇచ్చా.. ఇందిరమ్మ రాజ్యంలో వేములవాడను అభివృద్ధి చేసుకుంటున్నాం. మిడ్ మానేరు ముంపు బాధితుల సమస్యలను పరిష్కరిస్తామని ఆనాడే మాట ఇచ్చాం.. కలికోట సూరమ్మ ప్రాజెక్టును పూర్తి చేస్తామని పాదయాత్రలో చెప్పాం.. కాంగ్రెస్ హయాంలో మొదలు పెట్టిన ప్రాజెక్టులు కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పూర్తవుతాయని ఆనాడే చెప్పా.. ఈ ప్రాంతంలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.. నవంబర్ 30లోగా జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్ష చేస్తారు. దేశానికి దశ-దిశ సూచించిన నేత పీవీ పుట్టిన గడ్డ కరీంనగర్.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తామని ఈ కరీంనగర్ గడ్డపై నుంచే సోనియమ్మ మాట ఇచ్చారు... ఇచ్చిన మాటకు కట్టుబడి తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే ఎంత త్యాగానికైనా సిద్ధమవుతుందని సోనియమ్మ నిరూపించారు. కరీంనగర్‌లో బీజేపీని గెలిపిస్తే జిల్లాకు ఏం ఒరిగింది? కరీంనగర్ అభివృద్ధి కోసం పార్లమెంట్‌లో ప్రశ్నించారా? జిల్లా అభివృద్ధికి చిల్లి గవ్వ తెచ్చారా? అలా చేసి ఉంటే జిల్లాలో సాగు నీటి ప్రాజెక్టులు అసంపూర్తిగా మిగిలేవా? పదేళ్లలో రూ.20లక్షల కోట్లు ఖర్చు చేసిన కేసీఆర్.. రూ.100 కోట్లతో వేములవాడ ఆలయ అభివృద్ధి ఎందుకు చేయలేదు? ప్యాకేజీ 9 ఎందుకు పూర్తి చేయలేదు? గల్ఫ్ కార్మికుల కోసం గల్ఫ్ బోర్డ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది, ప్రమాదవశాత్తు మరణించిన గల్ఫ్ కార్మికులకు రూ.5లక్షల ప్రమాదబీమా అందిస్తున్నాం. కేసీఆర్ పదేళ్లలో చేయలేని పనులను మేం పది నెలల్లో చేసి చూపించాం. ఏలేశ్వరం పోయినా శనేశ్వరం వదలలేదన్నట్లు.. వాళ్లను ఓడించినా వాళ్ల తీరు మమారలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో సున్నా వచ్చింది.. ఇప్పుడు వాళ్ల వేషాలు చూస్తోంటే వాళ్ల మెదడు కూడా పోయినట్టుంది. పదేళ్లు ఏం వెలగబెట్టారని.. పదినెలల్లో మనల్ని దిగి పొమ్మంటున్నారు? మీ నొప్పికి మా కార్యకర్తలకు మందు ఎక్కడ పెట్టాలో తెలుసు.. రుణమాఫీపై దుష్ప్రచారం చేసున్న మీకు.. ధైర్యం ఉంటే నిజాన్ని ఎదుర్కొనే సత్తా ఉంటే అసెంబ్లీకి రా... మా వ్యవసాయ శాఖ మంత్రి సమాధానం చెబుతారు. పది నెలల్లో

**50వేల ఉద్యోగాలు ఇచ్చాం.. లెక్క కట్టి**

చూపిస్తా.. ఒక్క తల తగ్గినా నేను క్షమాపణ చెప్పేందుకు



సిద్ధంగా ఉన్నా.. మీ పదేళ్ల పాలనలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో... మా పదినెలల పాలనలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చామో చర్చకు పెడదాంరా.. ఆనాడు వరి వేసుకుంటే ఉరే అని చెప్పిన చరిత్ర కేసీఆర్ ది. ఆయన కట్టిన కాళేశ్వరం కుంగిపోయినా... ఒక్క చుక్క కాళేశ్వరం నీళ్లు లేకుండా 1కోటి 53లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండింది.. పదేళ్లలో కేసీఆర్ ప్రాజెక్టుల కోసం రూ.1లక్ష 23 వేల కోట్లు ఖర్చు చేశారు. ఏ ప్రాజెక్టునైనా పూర్తిచేశారా? ప్రజలకు నీళ్లు ఇచ్చామని చెప్పగలరా? రంగనాయక్ సాగర్ కోసం సేకరించిన భూముల్లో హరీశ్‌రావు ఫామ్ హౌస్ కట్టుకున్నారు.

అన్ని లెక్కలు తీస్తాం.. అన్నీ బయటకు తీస్తాం. కొండపోచమ్మ సాగర్ కట్టింది కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీళ్లు తీసుకెళ్లేందుకే.. బావ కళ్లల్లో ఆనందం చూడటానికి బామ్మర్ది డ్రగ్స్ తీసుకున్నా పట్టుకోవద్దట... పేదలకు ఒక చట్టం నీకో చట్టమా? ముఖ్యమంత్రిగా నా నియోజకవర్గం ప్రజలకు నీళ్లు ఇచ్చేందుకు నారాయణపేట్-కొడంగల్ ఎత్తిపోతల పూర్తి చేద్దామంటే కాళ్లల్లో కట్టెలు పెడుతున్నరు. పరిశ్రమలు తెస్తే మా ప్రాంతానికి ఉద్యోగాలు వస్తాయని అనుకుంటే భూసేకరణ జరగకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. కొంత మంది రౌడీ మూకలను తయారు చేసి అధికారులపై దాడి చేశారు. పైగా కేసులు పెట్టారని అంటున్నారు. నీ కొడుకు.. నీ అల్లుడు భాషను మీరు సమర్థిస్తారా కేసీఆర్... తెలంగాణలో పరిశ్రమలు పెట్టోద్దా.. మా పిల్లలకు ఉద్యోగాలు రావొద్దా? పదేళ్లు పాలించిన మీరు భూసేకరణ చేయలేదా? కొండమ్మ పోచమ్మసాగర్‌లో భూములు గుంజుకున్న చరిత్ర మీది..కొడంగల్‌లో భూసేకరణ చేస్తే మీకు కడుపుమంట దేనికి? కొడంగల్ అంటే మీకు ఎందుకు ఇంత కక్ష.. అభివృద్ధి జరగాలంటే భూసేకరణ జరగాల్సిందే.. భూములు కోల్పోయి బాధలో ఉన్న వారిని మా ప్రభుత్వం అక్కున చేర్చుకుంటుంది.. పరిహారం పెంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేటీఆర్ ఢిల్లీ కాదు చంద్రమండలం పోయి పిర్యాదు చేసుకున్నా సరే... చేసిన కుట్రకు నువ్వు ఊచలు లెక్కబెట్టాల్సిందే...చివరగా కేసీఆర్‌కు ఒక్క మాట చెబుతున్నా.. అసెంబ్లీకి రాసామి..ఒక్కసారిరా.... అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు.





# జర్నలిస్టులందరికీ...

## సంక్షేమ పథకాలను అంద జేయాలి

### టీఎస్ జేయూ డిమాండ్

గ్రేటర్ హైదరాబాద్ బ్యూరో, నేడు న్యూస్: జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలను అందించాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్‌జేయూ) ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ హరీష్ కుమార్‌కు అందించిన వినతి పత్రంలో కోరారు. అన్ని జర్నలిస్ట్ యూనియన్లకు అక్రిడిటేషన్ కమిటీలో భాగస్వామ్యం కల్పించాలని వారు కోరారు. నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (ఇండియా) ఎన్‌యూజే(ఐ) జాతీయ ఉపాధ్యక్షుడు నారగౌని పురుషోత్తం, టీఎస్‌జేయూ రాష్ట్ర అధ్యక్షుడు మెరుగు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి తోకల అనిల్‌కుమార్, కోశాధికారి పాపాని నాగరాజు, రాష్ట్ర నాయకులు క్రాంతికుమార్ కమిషనర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణలో జర్నలిస్టుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని వారు కోరారు. జర్నలిస్టుల వృత్తి భద్రత, హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యతని వారు అన్నారు. జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు, బెదిరింపులు వంటి అనేక సమస్యలను నివారించాలని వారు కోరారు. జర్నలిస్టుల భద్రతను సమర్థవంతంగా పరిరక్షించేందుకు జర్నలిస్టుల రక్షణ చట్టం తప్పనిసరిగా రూపొందించి అమలు చేయాలని కోరారు. ముఖ్యంగా జర్నలిస్టుల సంక్షేమ పథకాలకు అక్రిడిటేషన్ లింకును తీసివేయాలని, ప్రస్తుత పరిస్థితుల్లో అక్రిడిటేషన్ కార్డులు పొందని అనేక మంది జర్నలిస్టులు తమ వృత్తి సేవలను కొనసాగించడంలో తీవ్రమైన ఆర్థిక వృత్తిపరమైన సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. జర్నలిస్టుల సంక్షేమ పథకాలు ప్రతి జర్నలిస్టుకు అదే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా జర్నలిస్టులపై దాడుల నివారణ కోసం కమిటీలను నియమించాలని, బాధితులకు న్యాయం



అందించడానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, రాష్ట్ర స్థాయిలో కమిటీలను పునరుద్ధరించాలని వారు కోరారు. జర్నలిస్టులకు ఇళ్ల, స్థలాలు కేటాయించడంలో ప్రస్తుత యూనియన్ల ఆధ్వర్యంలో నిర్వహించే సంఘాలకు మాత్రమే కాకుండా ప్రభుత్వం స్వయంగా జర్నలిస్టుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. అనేక సంవత్సరాలుగా చిన్న పత్రికలకు ఎంప్యానల్‌మెంట్ జరగకపోవడం వల్ల చిన్న పత్రికల యజమానులు (వీరంతా జర్నలిస్టులే) తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే చిన్న పత్రికలకు ఎంప్యానల్‌మెంట్ చేయాలని వారు కోరారు. తెలంగాణ ప్రెస్ అండ్ మీడియా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, చిన్న పత్రికలు, మీడియాకు ఆర్థిక సాయం అందించడానికి ప్రెస్ అండ్ మీడియా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. జర్నలిస్టుల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక ఆరోగ్య బీమా పథకం రూపొందించాలని వారు కోరారు. గత ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టామని చెబుతున్నదని.. ఈ నేపథ్యంలో జర్నలిస్టుల సంక్షేమానికి గత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై సమగ్ర నివేదికతో శ్వేత పత్రం విడుదల చేయాలని వారు కోరారు. జర్నలిస్టుల వృత్తి నిర్వహణలో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నారని, వార్తల సేకరణలో ప్రమాదకర పరిస్థితులు, ఆరోగ్య ప్రమాదాలు, వృత్తి సంబంధిత బెదిరింపులకు గురవుతున్నారని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కాపాడడానికి ప్రత్యేక ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలన్నారు. ఈ పథకం ద్వారా జర్నలిస్టుల ఆసుపత్రి చికిత్సలు, ప్రమాద బీమా, ఆరోగ్య సంబంధిత సహాయాలు పొంద గలగాలని, జర్నలిస్టుల సురక్షిత భవిష్యత్తు కోసం ఈ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. ఈ డిమాండ్లను కమిటీ దృష్టికి తీసుకువెళ్లి అమలు చేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

## ఆరు గ్యారంటీల అమలుకు ఏం విక్రయిస్తారు?



హైదరాబాద్ : గద్దెనెక్కడం కోసం అడ్డగోలుగా గ్యారెంటీలు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీకి ప రిపాటిగా మారిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె టీఆర్ ధ్వజమెత్తారు. గ్యారెంటీల పేరుతో గద్దెనెక్కి రా ష్ట్రాన్ని దివాలా తీయించిన హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ సర్కారుకు మరో భంగపాటు ఎదురైన సంగతి తెలిసిందే. ఓ విద్యుత్తు సంస్థకు చెల్లించాల్సిన రూ.150 కోట్లను రికవరీ చేసేందుకు ఢిల్లీలోని హిమాచల్ భవన్ జప్తుకు హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఈ భవనాన్ని వేలం వేసి బకాయిలు తీర్చేసుకోవాలని సదరు కంపెనీకి సూచించిన విషయం విదితమే ఈ వ్యవహారంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు.

చేతికందినన్ని అప్పులు చేయడం, ఆఖరికి ఉన్న ఆస్తులు జప్తు చేయించుకునే పరిస్థితికి రా వడం దారుణమన్నారు. ఇది ఏ జూదగాని ఇంటి కథ కాదు..సాక్షాత్తూ హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వ తీరు అని కేటీఆర్ పేర్కొన్నారు. గ్యారంటీలు అమలు చేయలేక గంజాయి కూడా అమ్ముకునే పరిస్థితి మొన్న! మీరు చెల్లించాల్సిన అప్పు తేల్చకపోతే, ఢిల్లీలో మీ హిమాచల్ భవన్‌ను జప్తు చేస్తాం అని హైకోర్టు నేడు తీర్పునిచ్చింది. ఎంత సిగ్గుచేటు? అని కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు నడపడానికి బదులుగా సర్కస్‌లను నడుపుతోందని విమర్శించారు. మరి తెలంగాణలో మీరు ఆరు గ్యారెంటీలను అమలు చేయడానికి మీరు ఏం విక్రయిస్తారని రాహుల్ గాంధీని కేటీఆర్ ప్రశ్నించారు.

# 23న బహిరంగ విచారణ

లక్డీకాపూల్, నేడు న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం అట్టడుగు వర్గాల అభ్యున్నతికి తోడ్పాటునందించేందుకు నియమించిన బీసీ కమిషన్ ఈనెల 23న బహిరంగ విచారణ చేపట్టనున్నందున బీసీ తరగతులకు చెందిన వారు సామాజిక, ఆర్థిక, విద్య రంగాలలోసలహాలు, సూచనలు బీసీ కమిషన్‌కు ఇవ్వాలని హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అధికారి ఈ.వెంకటచారి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ కుల సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల స్థితిగతులను పరిశోధించడానికి బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, కమిటీ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీసీ వెల్ఫేర్ కమిషనర్ సభ్య కార్యదర్శిగా గల బీసీ కమిషన్ ఈనెల 23న హైదరాబాద్ కలెక్టరేట్(లక్డికాపూల్)లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ విచారణ చేపట్టనుందని అన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఆశన్న, జిల్లా మైనార్టీ సంక్షేమ



అధికారి ఇలియాజ్ అహ్మద్, సహాయ బీసీ సంక్షేమ అధికారి నరసింహులు, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పీఎం విశ్వకర్మ యోజన రుణం

- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- పోర్టల్ pmvishwakarma. gov. inలో నమోదు చేసుకోవచ్చు

లక్డీకాపూల్, నేడు న్యూస్: స్వయం ఉపాధి ప్రాతిపాదికన అసంఘటిత రంగంలో చేతి పనిముట్లతో పనిచేసే వారు ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జి. ఆశన్న తెలిపారు. బుధవారం కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరంలో బీసీ కుల సంఘ, ఎన్జీవోస్ లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పీఎం విశ్వకర్మ పథకం గురించి, ఎలా దరఖాస్తు చేసు కోవాలి అనే విషయంపై అవగాహన కల్పిం చారు. కుల వృత్తుల వారు కామన్ సర్వీస్ సెంటర్‌కు వెళ్లి https://pmvishwakarma.gov.in వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. జిల్లా సర్వే ఆఫీ



సర్ శ్రీరామ్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఇలియజ్ అహ్మద్, జిల్లా సహాయ అభివృద్ధి అధికారులు నరసింహులు, కృష్ణమాచారి, కుమ్మరి సంఘం అధ్యక్షుడు శివానంద, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నరసింహ, రజక సంఘం మాధవి అమ్ముల, సోఫా సొసైటీ ప్రాజెక్టు మేనేజర్ యెత్తిరి అంతయ్య, వడ్డెర సంఘం అధ్యక్షుడు ఆర్‌హెచ్ సంతోష్, ఆరెకటిక అబ్దుల్ ఖాలిక్, య వాల్మీకి సంఘం అధ్యక్షుడు ఎమ్మెస్ నరహరి తదితరులు పాల్గొన్నారు.

# అప్పరెల్ పార్క్ ఔట్?

★ మూతపడిన చర్మాస్, మహేంద్రా కంపెనీలు ★ఉపాధి కోల్పోయిన వేలాది మంది ★సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారిస్తారా?

గుండ్ల పోచంపల్లి, నేడున్యూస్:

**ఉపాధితో పాటు ఉత్పాదకత.. వ్యాపార అభివృద్ధి... ఆర్థిక పరిపుష్టి.... ఇలా ఎన్నో లక్ష్యాలతో ఏర్పాటైన అప్పరెల్ ఎక్స్‌పోర్ట్ పార్కు ఆనవాళ్లు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. పాలకుల నిర్లక్ష్యం పుణ్యమాని అప్పరెల్ పార్క్ ఔట్ అయ్యే ప్రమాదం నెలకొంది. సిక్స్ మినిట్ టూ సిక్స్టీ ఇయర్స్.... అనే స్లోగన్‌తో షాన్ ఏ షహర్ గ్రేటర్ హైదరాబాద్‌లో వస్త్ర ప్రపంచంలో కొత్త పుంతలు తొక్కించిన చర్మాస్ కంపెనీతో పాటు మహేంద్రా వంటి పెద్ద కంపెనీలు మూతపడటం ఆందోళన కలిగిస్తున్నది.**




వస్త్ర పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని చెప్పి తక్కువ ధరకే స్థలాలు కొనుగోలు చేసి వస్త్ర పరిశ్రమలు కాకుండా ఇతర కంపెనీలు ఏర్పాటు చేసి లీజుకు ఇవ్వడం... మరి కొంత మంది స్థలాలను అమ్ముకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అప్పరెల్ పార్కు ఏర్పాటుతో ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నిండుతాయని కన్న కలలు కల్లలుగానే మిగిలిపోతున్నాయి. వేలాది మందికి ఉపాధి కల్పించాల్సిన అప్పరెల్ పార్కు ఉపాధి కల్పించలేక బోసిపోతుంది. 1995లో అప్పరెల్ పార్క్ ప్రారంభం అయ్యింది. వేలాదిమంది కార్మికులకు ఉపాధి కల్పించాలని సంకల్పంతో మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధిలో 1995 జులై 10న అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు పునాది వేశారు. దాదాపు 174.26 ఎకరాల విస్తీర్ణంలో 100 కంటే ఎక్కువ వస్త్రాలు, దుస్తుల తయారీ యూనిట్లు నెలకొల్పేలా 1999 జూన్ 30న అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ పార్కును ప్రారంభించారు. 56 పరిశ్రమలకు ఇక్కడ అనుమతులు సైతం లభించాయి. దేశీయ అంతర్జాతీయ మార్కెట్ల కోసం ఎగుమతి ఆధారిత యూనిట్లను ఏర్పాటు చేశారు. అయితే కొంతకాలము బాగానే నడిచిన అప్పరెల్ ఎక్స్ పోర్టు పార్కు రాను రాను ప్రాధాన్యత తగ్గుతూ వస్తుంది. ప్రస్తుతం చర్మాస్, మహేంద్ర వంటి పెద్ద కంపెనీలు మూతపడటంతో వంద లాదిమంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. కొంతమంది వస్త్ర పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం నుండి తక్కు వ ధరకే స్థలాలు కొనుగోలు చేసి ఇతర కంపెనీలను ఏర్పాటు చేసి లీజ్‌కు ఇచ్చారు. మరి కొంతమంది ఈ స్థలాలను అమ్ము కున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ఈ పార్క్‌పై ప్రత్యేక దృష్టి సారించి అప్పరెల్ ఎక్స్‌పోర్టు పార్కుకు పూర్వ వైభవం తీసుకొచ్చి కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పిం చాలని పలువురు సీఎం రేవంత్ రెడ్డిని కోరుతున్నారు.

## వ్యవసాయ కార్మికులకు రూ.12 వేల జీవన భృతి ఇవ్వాలి



-అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం

దమ్మపేట, నేడున్యూస్: అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం దమ్మపేట మండలం జమేధారుబంజర్, గురవాయిగూడెం గ్రామాల్లో కరపత్రాలు ఆవిష్కరించి, జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అమర్లపూడి రాము, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్, నూపా భాస్కర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం వ్యవసాయ కార్మికులకు నెలకు 12,000 జీవన భృతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఏ ఒక్కటి కూడా అమలు కాలేదని, రైతులకు 2 లక్షల రుణమాఫీ, ఎకరానికి 15,000 రైతు భరోసా వంటి వాగ్దానాలు నెరవేర్చలేదని విమర్శించారు. జీవన భృతి లేకపోవడంతో వ్యవసాయ కార్మికులు వలస వెళ్లి దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే జీవన భృతి అమలు చేయకపోతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కురసం ముత్యాలరావు, తమా రాముడు, పండూరి వీరబాబు, ఊకె మహేష్, కుంజా కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

## యువకులు మృతి

-మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పరామర్శ
-మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత

మెదక్ టౌన్, నేడున్యూస్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. హవేలీ ఘనాపూర్ మండలం ఫరీద్ పూర్ వద్ద సమీపంలో మంగళవారం సాయంత్రం బైక్ అదుపు తప్పి ఇద్దరు యువకులు మృతి చెందారు. మండలంలోని జక్కన్నపేట గ్రామానికి చెందిన ప్రభాకర్, మహేష్ అనే యువకులు మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. చిన్న వయసులో ఇద్దరు మరణించడం చాలా బాధాకరమన్నారు. కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పరామర్శించిన వారిలో పద్మాదేవేందర్‌రెడ్డితో పాటు మెదక్ పట్టణ బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్, మున్సిపల్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు, జక్కన్నపేట మాజీ సర్పంచ్ చామంతుల సత్యానారాయణ తదితరులున్నారు.



## సైన్స్ ఫెయిర్ ముగింపు



అన్నపురెడ్డిపల్లి, నేడు న్యూస్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో మూడు రోజులపాటు నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ ముగింపు వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ, వ్యవసాయం ఒక సైన్స్. అత్యున్నత వ్యవసాయ పద్ధతులకు దోహదపడే ఆవిష్కరణలను సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించడం అభినందనీయమైన విషయం. సైన్స్ ఫెయిర్ కేవలం ప్రదర్శనలకే పరిమితం కాకుండా, వాటిని ప్రయోగాత్మకంగా నిరూపించగలిగే స్థాయికి విద్యార్థులను తీసుకువెళ్లాలి. మన విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, విజ్ఞానం పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భవిష్యత్తులో సమగ్ర వ్యవసాయ పద్ధతుల్ని అభివృద్ధి చేయడంలో ఈ జ్ఞానం ఉపయోగపడుతుంది అని అన్నారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ, తాను ఒక ప్రజాప్రతినిధిగా కాకుండా, తన గత జీవితం ఉపాధ్యాయుడిగా ఉన్న అనుభవంతో ఈ సైన్స్ ఫెయిర్‌ను చూసి ఎంతో సంతోషిస్తున్నాను. విద్యార్థుల ఆవిష్కరణలు వారి ప్రతిభను ప్రతిబింబిస్తున్నాయి. భవిష్యత్తు విద్యార్థులదే. వారు ఒక ఆలోచనతో ముందుకు సాగితే గ్రామాల అభివృద్ధి దిశగా మార్పులు తీసుకురాగలరు. మొక్కలు ఆటంకాలను ఎదుర్కొని ఎదిగినట్లే, విద్యార్థులు కూడా తమ లక్ష్యాలను చేరుకోవాలి అని ప్రేరణాత్మకంగా వ్యాఖ్యానించారు. సైన్స్ ప్రదర్శనలలో విద్యార్థుల సృజనాత్మకత ప్రతిబింబిస్తోందని ఎస్పీ రోహిత్ రాజు ప్రశంసించారు. సైన్స్ ప్రదర్శనల సందర్భంగా విద్యార్థుల నైపుణ్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, డీసీసీబీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, డీఈవో వెంకటేశ్వరచారి, జిల్లా సైన్స్ అధికారి చలపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ ఫెయిర్




అన్నపురెడ్డిపల్లి, నేడున్యూస్: అన్నపురెడ్డిపల్లి సోషల్ వెల్ఫేర్ పాఠశాల, జూనియర్ కళాశాల విక్రమ్ అంబలాల్ సారాబాయి ప్రాంగణంలో ఈనెల 18 నుంచి 20 వరకు నిర్వహించిన సైన్స్ ఫెయిర్ ఘనంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నలుమూలలనుంచి సుమారు 4000 విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సదస్సుకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అధ్యక్షత వహించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసి, వారు కష్టపడి ప్రదర్శించిన 900 పైగా ప్రాజెక్టులను పర్యవేక్షించారు. సీనియర్, జూనియర్, ఐటీడీఏ విభాగాలుగా ప్రాజెక్టులను విభజించి, న్యాయనిర్ణేతలు ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేశారు. 48 మంది విద్యార్థులు, ఉత్తమ ప్రాజెక్టులను ప్రదర్శించి, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు మరియు ప్రభుత్వ మెమంటోలు అందుకున్నారు. ఈ సదస్సులో ఆరుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కాగా, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రత్యేకంగా వారిని అభినందించారు. మీ ప్రతిభతో జిల్లాకు మంచి పేరు తెచ్చుకోండి అని వారు ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్, విద్యాశాఖ అధికారి ఎం వెంకటేశ్వరచారి, జిల్లా సైన్స్ అధికారి చలపతిరాజు, సోషల్ వెల్ఫేర్ గురుకులాల జోనల్ అధికారిణి స్వరూప రాణి, విద్యాశాఖ డైరెక్టర్, శాసనసభ్యులు కోరం కనకయ్య, రాష్ట్ర మార్క్ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కన్నీళ్ల పండగ వేడుకలు



అశ్వారావుపేట, నేడున్యూస్: అశ్వారావుపేట పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం కన్నీళ్ల పండగ వేడుకలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ఆలయంలో అయ్యప్ప స్వామి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వామికి పాలు, తేనె, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. భక్తుల ఆరాధనకు నిండైన భావప్రాధాన్యతతో కన్నీళ్ల పండగ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. కార్యక్రమంలో అర్చకులు రాఘవ శర్మతో పాటు అయ్యప్ప మాల ధరించిన స్వాములు పాల్గొన్నారు.

## పశువైద్య శిబిరం



ఇబ్రహీంపట్నం, నేడు న్యూస్: పశువైద్య శాఖ ఆధ్వర్యంలో తులేకలన్ గ్రామంలో పశు వైద్య శిబిరం గర్భశోక వ్యాధుల పరీక్ష నిర్వహించే కార్యక్రమం ఈ సందర్భంలో 25 పశువులు సుడి నిర్ధారణ పరీక్షలు గర్భాశ్యపరీక్షలు ఆల్ట్ స్టాండ్ యంత్రంలో నిర్ధారించడం జరిగింది. 40 పశువులకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో పశు సమర్ధన శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ శ్రావణ్ మాట్లాడుతూ, లాస్ట్ స్టాండ్ యంత్రం ద్వారా పశువులు గర్భం దాల్చిన తర్వాత 28 రోజులకై సుడిపరీక్షల ద్వారా నిర్ధారణ చేయవచ్చని దీని ద్వారా పునరుత్పత్తి సామర్థ్యం పెంచవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎలిమినేడు పశు వైద్య అధికారి డాక్టర్ వై.ఆనందరెడ్డి సుడి పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సదానందం, ఆఫీసర్ సబర్తినేటర్ గోపాల మిత్రులు జగన్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ ఫోన్ అప్పగింత



బయ్యారం, నేడు న్యూస్: ఇటీవల గంధంపల్లి ఫంక్షన్ హాల్లో జరిగిన వివాహానికి హాజరైన పోలోజు సృజన అనే మహిళ తన మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నారు.బయ్యారం పోలీస్ స్టేషన్ లో బాధితురాలు కంప్లైంట్ ఇవ్వడంతో పోలీసులు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సదరు మహిళ పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ వరంగల్ లో ఉందని ఆచూకీ తెలుసుకున్న పోలీసులు ఆ మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్న బాధితులకు బయ్యారం ఎస్సై తిరుపతి బుధవారం అందించారు. పోలీసులను పలువురు అభినందించారు.

## గృహప్రవేశ కార్యం



అల్మాస్‌గూడ, నేడు న్యూస్: నూతన గృహప్రవేశ కార్యక్రమంలో కాంగ్రె స్ పార్టీ సీనియర్ నాయకుడు జంగయ్య గౌడ్ పాల్గొన్నారు. అల్మాస్ గూడ హిల్స్‌కాలనీలో రంగారెడ్డి జిల్లా కోర్టు ఉద్యోగి ఎన్నుదుల జగదీ ష్ గృహప్రవేశ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జంగయ్య గౌడ్, ఎన్నుదుల మహేష్ పాల్గొనడం జరిగింది.

## ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

* కాంగ్రెస్ అధ్యక్షుడు బుర్ర దేవేందర్‌గౌడ్



నడికుడ, నేడున్యూస్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు భారీగా తరలివచ్చిన నడికూడ కాంగ్రెస్ నాయకులకు, మహిళామణు లకు, యువతకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్‌గౌడ్ తెలిపారు. పరకాల అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పిలుపుమేరకు నడికూడ మండలం నుంచి అభిమానంతో వచ్చి సీఎం సభను విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

## డీసీఆర్‌బీ డీఎస్పీ ఉమామహేశ్వర్

వనపర్తి, నేడు బ్యూరో: వనపర్తి డీసీఆర్‌బీ డీఎస్పీగా ఉమామహేశ్వర్ రావు బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు వనపర్తి జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రావుల గిరిధర్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని.. శాంతి భద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జగిత్యాల జిల్లా మెట్టుపల్లి డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఉమామహేశ్వర్ వనపర్తి జిల్లాకు బదిలీపై వచ్చారు.






## ఆదర్శ రైతు డివిజన్ కమిటీ

బయ్యారం, నేడున్యూస్: రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం నిరంతరం పనిచేయడం కోసం మళ్లీ గ్రామాలలో ఆదర్శ రైతుల నియమకాన్ని చేపట్టాలని చర్చ మొదలు కావడంతో అందుకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నియామకం చేపట్టిన ఆదర్శ రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు.ఆదర్శ రైతు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బయ్యారం మండలానికి చెందిన ఆదర్శ రైతు రాష్ట్ర నాయకులు గండ్రాతి బాస్కర్ రెడ్డి అధ్యక్షతన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఆదర్శ రైతుల మహబూబాబాద్ డివిజన్ నూతన కమిటీ ఎన్నుకున్నట్లు బుదవారం మీడియాకు తెలిపారు. కమిటీలో.... డివిజన్ అధ్యక్షుడు ఏనుగు వెంకట్‌రెడ్డి (మహబూబాబాద్), ఉపాధ్యక్షుడు రూపురెడ్డి కళావతి (కల్వ), ప్రధాన కార్యదర్శి నాయిని ఇంద్రారెడ్డి (బయ్యారం), సహాయ కార్యదర్శి పడకంటి వెంకటేశ్వర్లు (మేతురాజు పల్లి),కోశాధికారి వాంకుడోత్ సర్వం (తిమ్మంపేట) తదితరులున్నారు.

## వాటర్ క్యాన్ల పంపిణీ



వలిగొండ, నేడున్యూస్: మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో తల్లిదండ్రులైన దివంగత కొత్త పెద్దులు,బుచ్చమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంకటాపురం గ్రామ వాస్తవ్యుడు బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కొత్త రామచందర్ యాదవ్ ఆధ్వర్యంలో మంచినీటి క్యాన్లను పంపిణీ చేశారు. కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ అధ్యక్షత వహించగా జిల్లా పార్టీ అధ్యక్షుడు పాశం భాస్కర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, కొత్త రామచందర్ యాదవ్ ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో వెంకటాపురం మాజీ సర్పంచ్ కొత్త నరసింహ, భారతీయ జనతా పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ బందారపు లింగస్వామి,భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సిఎన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పుల యాదిరెడ్డి, సీనియర్ నాయకులు దంతూరి సత్తయ్య గౌడ్, రాచకొండ కృష్ణ, సీనియర్ నాయకులు సీలోజు శ్రీరాములు, కణతాల అశోక్‌రెడ్డి, రంజిత్ రెడ్డి, వెంకటేశం, ఎలగందుల రవీందర్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు

బయ్యారం, నేడు న్యూస్: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చొరవతో మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి భూక్యా ప్రవీణ్ నాయక్ ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గంధంపల్లి కి చెందిన ముత్తంచెట్టి స్వరూప కు రూ. 21వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్ అందజేశారు.ఈ సందర్భంగా ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా.. సీఎం రేవంత్ రెడ్డి చికిత్స కోసం ఆసుపత్రులకు డబ్బు ఖర్చు చేసిన పేద వారికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా చేయూతనివ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో బోడ సాయిక్రిష్ణ,చల్ల సురేష్,గట్టు శ్రీను,ధార రఘుపతి, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.




## మంత్రి మనోహర్‌కు ప్రశంసలు
-ప్రశంసించిన ఏపీ సీఎం చంద్రబాబు



**అమరావతి బ్యూరో, నేడు న్యూస్:** దీపం పథకం-2ను రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సమర్థంవంతంగా అమలు చేస్తున్నారని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. బుధవారం జరిగిన శాసనసభ సమావేశాల్లో సీఎం చంద్రబాబు సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, గతంలో మహారాష్ట్రలో రామ్‌నాయక్ అనే కేంద్ర మంత్రిని, ప్రధాని వాజ్‌పెయ్‌ని మెప్పించి ఆ రోజుల్లోనే దీపం పథకంను ఇంటింటికీ అమలు చేసిన పార్టీ తెలుగుదేశం అన్నారు. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని ఎన్నికల్లో చెప్పాం. ఆ దిశగానే ముందుకెళుతున్నామన్నారు. కొందరు తెలియనివాళ్లు గ్యాస్ ఎక్కడిచ్చారని మాట్లాడుతున్నారని.. ఇది క్యాష్ కాదు చేతికివ్వడానికి.. గ్యాస్ అని చలోక్తి విసిరారు. కేవలం రేషన్ కార్డు, ఆధార్ కార్డు ఆధారంగానే గ్యాస్ బుకింగ్ చేసుకునే వారందరికీ ఉచితంగానే ఇస్తున్నామన్నారు. ఇప్పటికైనా వాస్తవం తెలుసుకుని విమర్శలు మానుకోవాలన్నారు.

# సుపరిపాలన ఎన్డీయే విధానం

*ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



**అమరావతి బ్యూరో, నేడు న్యూస్:** సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ఎన్డీయే విధానం. పేదల ఆదాయం పెరగాలి.. ఖర్చులు తగ్గాలి. ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలే ధ్యేయంగా పని చేస్తాం. సూపర్-6, మేనిఫెస్టో హామీలను అమలు చేస్తూ ముందుకెళ్తున్నాం. సంక్షేమం ప్రారంభమైంది టీడీపీ ఆవిర్భావంతోనే. ప్రతి మనిషికి కూడు, గుడ్డ, నీడ ఉండాలనేది ఎన్టీఆర్ ఇచ్చిన నినాదం. ఎన్టీఆర్ రూ.2 లకే కిలో బియ్యం ప్రవేశపెట్టారు. అది ఇప్పుడు దేశం మొత్తం అమలైంది.పేదలకు పింఛను రూ.30లతో ప్రారంభించారు. రైతులను ఆదుకునేందుకు రూ.50 లకే హార్స్ పవర్ విద్యుత్ అందించాం. పేదలు ఉండాల్సింది గుడిసెల్లో కాదు.. పక్కా ఇళ్లని ఆలోచించి ఇళ్లు కట్టించారు. సగం ధరకే జనతా వస్త్రాల పంపిణీ చేశారు' అని సీఎం చంద్రబాబు అన్నారు. 162 రోజుల కూటమి పాలనపై సీఎం చంద్రబాబు శాసనసభలో ప్రసంగించారు. అక్రమంగా కేసులు నమోదు చేసి జైలుకు పంపారు. నేను ఏ తప్పూ చేయలేదు.. చేయను. అనుక్షణం ప్రజల కోసమే పని చేస్తా. ఇబ్బందులు పెట్టినప్పుడు మరింత మనోధైర్యం పెంచుకుని ఏం చేస్తే ప్రజల రుణం తీర్చుకుంటానో ఆలోచిస్తా. 53 రోజులు నన్ను జైల్లో పెడితే 80 దేశాల్లో తెలుగువారు నా కోసం పోరాటాలు చేయడం జీవితంలో మరచిపోలేను. 'నాలుగోసారి మళ్లీ సీఎం అయ్యాను. అవినీతి, కులం, మతం, వర్గం, డబ్బులతో ప్రభావితమయ్యే ఈ రోజుల్లో నాపై నమ్మకం పెట్టుకుని ప్రజలు గెలిపించారు. అధికారం నాకు కొత్త కాదు.. సీఎం కుర్చీ కొత్తకాదు. దేశ రాజకీయాలు నాకు కొత్తకాదు. గత ఐదేళ్ల విధ్వంస పాలనతో ఎప్పుడూ లేని పరిస్థితులు చూస్తున్నాను. కూటమి పాలన ప్రారంభమై 162 రోజులు అయింది. గాడి తప్పిన వ్యవస్థలను గాడిన పెట్టాం. అప్పులు లేవని బయట ఇష్టానుసారంగా ప్రచారం చేశారు.. సాక్ష్యాలతో రూ.10 లక్షల కోట్ల అప్పులున్నాయని చూపించాం. దీపం పథకం ప్రారంభించాక ఇప్పటి వరకు 42.40 లక్షల మంది గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకున్నారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు ఎవరికున్నా అర్హులే అవుతారు. సిలిండర్ బుక్ చేసుకన్న 48 గంటల్లోనే డబ్బులు అకౌంట్లో జమ అవుతాయి. 217 జీవో తెచ్చి మత్స్యకారులు పొట్టగొట్టారు. ఆ జీవోను రద్దు చేసి మత్స్యకారులకు అండగా ఉన్నాం. స్వర్ణకారుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేశాం. పోలీస్ శాఖను బలోపేతం చేసి శాంతిభద్రతలకు ప్రాధాన్యం ఇస్తాం. సుపరిపాలనకు నాంది పలికాం. అభివృద్ధి, సంక్షేమం సజావుగా ఉండాలంటే గుడ్ గవర్నెన్స్ ఉండాలి.

## విచిత్ర వేషధారణ పోటీలు
* చిన్నారి వరలక్ష్మి ప్రతిభ



**విజయవాడ టౌన్, నేడున్యూస్:** జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చిన్నారులకు పలు విభాగాల్లో నిర్వహించిన పోటీలకు సంబంధించి బుధవారం విజయవాడలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో బహుమతి ప్రధానోత్సవం జరిగింది. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారం రోజులపాటు విద్యార్థినీ, విద్యార్థులకు డ్రాయింగ్, విచిత్ర వేషధారణ, కథ చెప్పటం, చదరంగం, వ్యాసరచన, మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్, వక్తృత్వం, క్యారమ్స్, దేశభక్తి గేయాలు తదితర అంశాల్లో విభాగాల వారీగా పోటీలు నిర్వహించారు. వారోత్సవాల ముగింపు సందర్భంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. పోటీల్లో భాగంగా విచిత్ర వేషధారణలో శ్రీ బస్వా అప్పలస్వామి నగరపాలక ప్రాథమిక పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థిని ఏలూరి వరలక్ష్మి విశేష ప్రతిభ కనబరిచి నిర్వాహకుల నుంచి కన్సోలేషన్ బహుమతి అందుకుంది. ఈ సందర్భంగా చిన్నారి వరలక్ష్మి మాట్లాడుతూ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ బహుమతి అందుకోవడం సంతోషంగా ఉందని తెలిపింది. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.రమాదేవి, సిబ్బంది, పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## జీవితాన్ని నేర్పించేవి గ్రంథాలయాలు




**నెల్లూరు బ్యూరో, నేడు న్యూస్:** విద్యార్థులను గ్రంథాలయాల వైపు నడిపించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజా అన్నారు. బుధవారం స్థానిక రేబాలవారి వీధిలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజా మాట్లాడుతూ, నేటి డిజిటల్ ప్రపంచంలో మునిగిపోయిన మన పిల్లలకు సమాజంలో ఎలా జీవించాలో నేర్పించే గ్రంథాలయాలను పరిచయం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగుల అసోసియేషన్ ప్రెసిడెంట్ నాగేంద్రరావు, నటరాజ నృత్య అకాడమీ శిక్షకురాలు త్రిపుర, ఉత్తమ గ్రంథ పాలకురాలు మంజుల, సౌత్ ఇండియా యోగ గోల్డ్ మెడలిస్ట్ సమత, సతీష్ కుమార్, పలువురు ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎంతో సోమిరెడ్డి భేటీ



**నెల్లూరు బ్యూరో, నేడు న్యూస్:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో టిడిపి సీనియర్ నేత, పొలిటి బ్యూరో సభ్యులు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబుతో బేటీ అయ్యారు. సర్వేపల్లి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు ప్రధాన సమస్యలతో పాటు రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులకు నిధులు, పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు, కొత్త పరిశ్రమల ఏర్పాటు తదితర అంశాలను సీఎం దృష్టికి ఎంఎల్ఏ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే వివరించి అంశాలపై ముఖ్యమంత్రి సుదీర్ఘంగా సోమిరెడ్డి తో చర్చించడం జరిగింది.

## నాటు బాంబు పేలుడు
-ఆవుకు తీవ్ర గాయాలు



**మనుబోలు, నేడు న్యూస్:** మండల పరిధిలోని మడమనూరు గ్రామం అటవీ ప్రాంతంలో మేతమేస్తూ ఆవు నాటు బాంబును కొరికింది. దీంతో ఈ మూగ జీవి నోరు చీలిపోయింది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలను ఉన్నాయి. మడమనూరు గ్రామానికి చెందిన అనింగి ద్వారకయ్య అనే రైతుకు చెందిన ఆవు మేతమేస్తుండగా.. అడవి పందుల కోసం పెట్టిన నాటుబాంబును కొరికింది. క్షణాలలో నాటుబాంబు పేలి ఆవు దవడ చీలిపోయింది. అక్కడే పశువులు మేపుతున్న యజమాని ద్వారకయ్య బాంబు శబ్దానికి హడాలి పోయాడు. తేరుకుని పరిశీలించగా ఆవు దవడ కాస్త రక్తం కారుతూ చీలిపోయి కనిపించింది. నోరులేని మూగజీవానికి ఈ ప్రమాదం పలువురుని కలిచి వేసింది. వెంటనే రైతు ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. వీరిని గుర్తించి చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో మనుషులు కూడా నాటు బాంబులకు బలి అయ్యే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

## వైసీపీ విస్తృత సమావేశం



**నెల్లూరు బ్యూరో, నేడు న్యూస్:** వైఎస్ఆర్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాని గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ విస్తృత సమావేశం జరిగింది. సమావేశానికి ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దినేష్‌రెడ్డి త్యాగానికి గుర్తింపు



**నెల్లూరు బ్యూరో, నేడు న్యూస్:** విజయవాడ ఏపీఐఐసీ కాలనీ లోని ఏపీ మార్క్‌ఫెడ్ బిల్డింగ్ లోని రెండవ అంతస్తులో తెలు గుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పొలంరెడ్డి దినేష్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ఎన్విరాన్మెంట్ మే నేజ్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మైనారిటీ, న్యా య శాఖల మంత్రి నాశ్యం మహమ్మద్ ఫరూక్‌తో కలిసి బాధ్యత స్వీకరణ మహోత్సవంలో నె ల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ పోలంరెడ్డి దినేష్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. అనంతరం అబ్దుల్ అజీజ్ మీడియా తో మాట్లాడుతూ, దినేష్ రెడ్డి పడిన కష్టాన్ని, చేసిన త్యాగాన్ని తెలుగుదేశం పార్టీ గుర్తించిందని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కష్ట నష్టాలను తెలుసుకున్న వ్యక్తి పోలంరెడ్డి దినేష్ రెడ్డి అని, పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఇచ్చిన బాధ్యతలను దినేష్ రెడ్డి విజయవంతంగా నిర్వహిస్తారని నమ్ముతున్నామని పేర్కొన్నారు.

## రైతు ఉత్పత్తిదారుల..
-సంఘాలను బలోపేతం చేయాలి



**కోవూరు, నేడు న్యూస్:** జిల్లాలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ చెప్పారు. బుధవారం కోవూరు మండలంలోని లేగుంటపాడు గ్రామంలో ప్రగతి యువ కేంద్రం రైతు ఉత్పత్తిదారుల కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో రైతు ఉత్పత్తిదారుల సంఘాలను మరింత అభివృద్ధి చెందడానికి అవసరమైన సహకారం అందిస్తామన్నారు.

## కిశోర్ రత్నం మానవత్వం

**కావలి, నేడు న్యూస్:** తుఫాన్‌నగర్లోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో సంస్థ సంరక్షణలో ఉన్న పిల్లలకు పట్టణంలోని డాక్టర్ కిశోర్ రత్నం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ పాఠశాల విద్యార్థులు హ్యాండ్స్ టు హ్యాపీ నెస్ ద్వారా చేయూత అందించడం జరిగింది. కార్యక్రమంలో వాసవి వనిత లెజెండ్స్ కావలి జోన్ చైర్మన్ కామాక్షి, సంయుక్త సేవా సంస్థ సభ్యుడు చంద్రశేఖర్, సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర పాల్గొన్నారు.




## వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్
-అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి
-కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్



**తిరుపతి బ్యూరో, నేడు న్యూస్:** వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులలో భాగంగా వివిధ పారిశ్రామికవాడలకు కావలసిన నీటి సరఫరా పైపులైన్ పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

## భూ సమస్యలకు పరిష్కారం చూపాలి

**తిరుపతి బ్యూరో, నేడు న్యూస్:** శెట్టిపల్లి భూ సమస్యలకు త్వరిత గతిన పరిష్కారం చేసేలా సంబంధిత అధికారులు కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలు జారీ చేశారు. బుదవారం కలెక్టర్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్‌తో కలిసి శెట్టిపల్లి భూ సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తిరుపతి నగర పాలక మున్సిపల్ కమిషనర్ మౌర్య, తిరుపతి ఆర్‌డిఓ రామ్మోహన్, జిల్లా సర్వే అధికారి అరుణ్ కుమార్, తాసిల్దార్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణ సేవా సమితి దాతృత్వం

**గూడూరు, నేడు న్యూస్:** కృష్ణ సేవా సమితి దాతృత్వంతో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో మయూరి శ్యామ్ యాదవ్ నేతృత్వంలో బుధవారం వీల్ చైర్ వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సంస్థ నిర్వాహకులు మయూరి శ్యామ్ మాతృమూర్తి బండి వనమ్మ మూడవ వర్ధంతిని పురస్కరించు కొని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు వినియోగించుకునేందుకు వీల్ చైర్ ను వితరణ చేశారు.




# అప్పులపై అబద్ధాల ప్రచారం

*ఏపీ సీఎం చంద్రబాబుపై
జగన్ మండిపాటు



**అమరావతి బ్యూరో, నేడు న్యూస్:** సూపర్ సిక్స్ హామీలు ఎక్కడంటే? బొంకుల బాబు బొంకులాడుతున్నారని వైసీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. ఆర్థిక పరిస్థితి అప్పులపై చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారని, కాగ్ రిపోర్టులు, బడ్జెట్ లెక్కల ఆధారంగా చంద్రబాబు అబద్దాలు బయటపడ్డాయని, హామీలు అమలు చేయలేక బొంకుతున్నారన్నారు.

ఈ మేరకు బుధవారం ఆయన తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమవేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూటమి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆర్థిక పరిస్థితిపై అసలు వాస్తవాలు వెలుగు చూశాయని, బడ్జెట్ పెడితే అసలు లెక్కలు, సూపర్ సిక్స్, మోసాలు, అబద్ధాలు బయటకు రాక తప్పదని, ఆర్థిక స్థితిపై అసలు పరిస్థితి బయటకు రాని పరిస్థితులు వస్తాయనే, ఇన్ని రోజులు బడ్జెట్ ప్రవేశపెట్టకుండా వాయిదా వేస్తూ వచ్చారని జగన్ ఆరోపించారు. చివరకు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఇంతవరకు చెప్పిన అబద్దాలు రుజువయ్యాయని వ్యాఖ్యానించారు. బడ్జెట్ ప్రవేశపెట్టగానే అందులో నిజాలు బయటపెట్టినా చంద్రబాబులో మార్పు లేదని, బడ్జెట్ కేటాయింపులు గురించి సుదీర్ఘంగా చెప్పినా చంద్రబాబు నేనింతే, అబద్దాలు ఇలాగే చెప్పడానికి జస్టిఫికేషన్ కావాలనేలా అబద్దాలు కొనసాగించారని జగన్ ఆరోపించారు. రాష్ట్రానికి సంబంధించిన అప్పు ఎంత, రాష్ట్రంలో అప్పులు ఏ మేరకు ఉన్నాయో బడ్జెట్ డాక్యుమెంట్‌లో చూపించక తప్పదని, బడ్జెట్ ప్రవేశపెడితే ఇది తప్పకుండా చేయాలన్నారు. చంద్రబాబు బడ్జెట్‌లో అప్పులు పేజీ 14,16 లలో ప్రస్తావించారని, రాష్ట్ర అప్పులు, 2018-19లో రూ. 2.57లక్షల కోట్లు ఉన్నాయని చంద్రబాబు చూపించారని, 16వ పేజీలో 2018-19లో ప్రభుత్వ గ్యారెంటీ ఇచ్చిన అప్పులు రూ.55వేలు కోట్లని వివరించారని, రూ.3.13లక్షల కోట్ల అప్పులు చంద్రబాబు దిగిపోయే సమయానికి ఉన్నాయని వివరించారన్నారు. 2023-24 నాటికి రాష్ట్ర ప్రభుత్వం అప్పులు రూ. 4.84లక్షల కోట్లు, ప్రభుత్వ గ్యారెంటీలతో లక్షా 84వేల కోట్లు మొత్తం రూ. 6.46లక్షల కోట్లు అప్పులు ఉన్నాయని బడ్జెట్‌లో పేర్కొన్నారని చెప్పారు. 2024లో ప్రభుత్వం మారేనాటికి రూ.6.46లక్షల కోట్ల అప్పులున్నట్లు జగన్ చెప్పారు. కాగ్ నివేదికలో 2023-24నాటికి రాష్ట్ర ప్రభుత్వానికి ఇదే అప్పుగా నిర్ధారించినట్టు వైసీపీ అధ్యక్షుడు జగన్ వివరించారు. ఏపీ అప్పులు రూ.11లక్షల కోట్లె, 12.5 లక్షల కోట్లు, 14లక్షల కోట్లు అంటూ అప్పులపై తప్పుడు ప్రచారం చేయడం ధర్మమేనా అని జగన్ ప్రశ్నించారు. చంద్రబాబుతో పాటు అనుకూల మీడియా దుష్ప్రచారం కొనసాగించారని, పద్దతి ప్రకారం తమ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేశారని ఆరోపించారు.





## ఆరోరాలో అగ్ని ప్రమాదం

**-ఒకరు మృతి.. ముగ్గురు పరిస్థితి విషమం**

**జీడిమెట్ల, నేడున్యూస్:** ఆరోరా ఫార్మా కంపెనీలోని రియాక్టర్‌లో కెమికల్ మిక్స్ చేస్తుండగా అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో సూరారంకు చెందిన కార్మికుడు అనిల్ మృతి చెందగా మరో ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. మేడ్చల్ జిల్లా జీడిమెట్ల పారిశ్రామికవాడలోని ఆరోరా పరిశ్రమలో చోటుచేసుకున్న ఘటనలో గాయపడిన కార్మికులను సికింద్రాబాద్ యశోద హాస్పిటల్‌కు తరలించారు. ఆ తర్వాత బంధువులకు సమాచారమిచ్చారు. ఘటన స్థలానికి మృతుని బంధువులు రావడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. సూరారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ

- **భూమి పూజ చేసిన టిపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మేయర్ అజయ్ యాదవ్**
- **పాల్గొన్న డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి**



**బోడుప్పల్, నేడున్యూస్:** బోడుప్పల్ నగర పరిధిలోని ఎస్సీ బస్తీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీపిసిసి ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మేయర్ అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, కార్పొరేటర్ చీరాల నరసింహ తో కలిసి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. దీనిపై స్థానిక కార్పొరేటర్ చీరాల నరసింహ, ఎస్సీ బస్తివాసులు తోటకూర వజ్రేష్ యాదవ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, దానగాళ్ళ యాదగిరి, నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గందె విశ్వేశ్వర్ గుప్త, కాంగ్రెస్ నాయకులు, ఎస్సీ బస్తీ నాయకులు ఎస్సీ బస్తి నాయకులు చీరాల జంగయ్య, చంచల నర్సింగ రావు, కె. నరసింహ, రాపోలు ఉపేందర్, రాపోలు రామస్వామి, శ్రీనివాస్ తదితరు పాల్గొన్నారు.

## పోలీసులకు క్రికెట్ కిట్లు



**వనపర్తి టౌన్, నేడుబ్యూరో:** తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ కార్పొరేషన్ చైర్మన్ కొత్తకాపు శివసేనరెడ్డి వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్‌తో కలిసి జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణంలోని క్రీడ మైదానాన్ని పరిశీలించారు. క్రీడా మైదానం అభివృద్ధి ప్రణాళికను గురించి ఎస్పీతో చర్చించారు. పోలీసు క్రీడా మైదానం అభివృద్ధి కోసం తెలంగాణ క్రీడల విధుల నుండి సహాయ సహకారాలు అందజేస్తామని శివసేనరెడ్డి హామీ ఇచ్చారు. అదేవిధంగా జిల్లా పోలీసులకు క్రికెట్, వాలీబాల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సుధీర్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నరేష్, సాయుధ దళ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, శ్రీనివాస్, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ
# అందరి బాధ్యత



***వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పిలుపు**

**వనపర్తి బ్యూరో, నేడుబ్యూరో:** రోడ్డు ప్రమాదాల నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని.. అప్పుడే ప్రమాదాల సంఖ్యను తగ్గించగలుగుతామని.. వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పిలుపునిచ్చారు. ప్రతిఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు.

వనపర్తి జిల్లా కేంద్రంలోని రావుస్ జూనియర్ కళాశాలలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఉల్లంఘన అవగాహన కార్యక్రమంలో వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ ముఖ్యఅతిథిగా పాల్గొని రోడ్డు ప్రమాదాలు, నివారణ అనే అంశంపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలకు అనేక రకాల కారణాలుంటాయని..ఇందులో ప్రధానంగా మద్యం సేవించి వాహనాలు నడపడం అన్నారు. ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన లేకపోవడం లాంటివి ప్రధాన కారణాలని చెప్పారు. జిల్లాలో చాలా మంది వాహనదారులు తమ వాహనాలకు నంబర్ ప్లేట్స్ లేకుండా ప్రయాణిస్తున్నారని... అది చట్టరీత్యా నేరమని తేల్చిచెప్పారు. ఇకనైనా తమ వాహనాలకు నంబర్ ప్లేట్స్ ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఉండాలని లేని యెడల వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని ఎస్పీ హెచ్చరించారు. వాహనాలపై ప్రెస్, పోలీసు పేరిట స్టికర్స్ పెట్టుకునే వారిని గుర్తించేందుకు త్వరలోనే స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నామని.. తల్లిదండ్రులు తమ పిల్లల జీవన శైలిపై కుటుంబ పెద్దలు దృష్టి పెట్టడం వలన పలు అనర్థాలను నివరించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వనపర్తి సీఐ, ఎం.క్రిష్ణ, వనపర్తి పట్టణ ఎస్ఐ హరిప్రసాద్, ట్రాఫిక్ ఆర్ఎస్ఐ సురేందర్, ట్రాఫిక్ ఏఎస్ఐ నిరంజన్, రావుస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, రాంకుమార్, జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాల పర్యటనలు పూర్తి చేస్తాం

**-డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్ బీ.వెంకటేశ్వరరావు**



**హైదరాబాద్, నేడు న్యూస్:** స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ కేటాయించేందుకు సమగ్రమైన నివేదిక ఇవ్వడానికి ప్రయత్నం చేస్తున్నామని డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బీ.వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం డెడికేటెడ్ కమిషన్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నుంచి, బీసీ సంఘాలు, బీసీ మేధావుల నుంచి వినతిపత్రాలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన డెడికేటెడ్ కమిషన్ బృందం ఇప్పటి వరకు ఐదు జిల్లాల్లో (ఉమ్మడి జిల్లాలు) పర్యటించి అక్కడి ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, బీసీ కుల సంఘాలు, మేధావుల నుంచి సమాచారం తీసుకున్నామని ఆయన చెప్పారు. జిల్లాలో ప్రజల నుంచి అనూహ్యమైన స్పందన వస్తుందని, అతి త్వరలో మిగతా జిల్లాలో పర్యటించి వివరాలు తెలుసుకుంటామని చైర్మన్ అన్నారు. తాము ఊహించిన దాని కన్నా ఎక్కువగా వినతిపత్రాలు వస్తున్నాయన్నారు. కుల గణన పూర్తి వివరాలు వచ్చిన తర్వాత వాటన్నింటిని పరిగణనలోకి తీసుకుని బీసీలకు రాజకీయ రిజర్వేషన్ల కోసం ఎలాంటి న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా నివేదికను అందించే ప్రయత్నం చేస్తున్నామని ఆయన చెప్పారు. ఈ మేరకు బీజేపీ బీసీ సెల్ నాయకులు, వివిధ కుల సంఘాల నేతలు కమిషన్‌ను కలిసి వినతిపత్రాలు అందించారు. జనాభా లెక్కల ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కేటాయించాలని కోరారు. డెడికేటెడ్ కమిషన్ కార్యదర్శి బడుగు సైదులు, ఎంబీసీ చైర్మన్ అలోక్ కుమార్ మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

# అక్రమమా? సక్రమమా?



- **చెంగిచెర్లలో ముత్తిరెడ్డి బహుళ అంతస్తుల నిర్మాణాన్ని నిలిపివేయించండి**
- **సర్వేనెంబర్ 59, 57 చింతలకుంట చెరువు విస్తీర్ణాన్ని సర్వే చేయించండి**
- **హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేసిన డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్**

**బోడుప్పల్, నేడు న్యూస్:** బోడుప్పల్ నగర పరిధిలోని చెంగిచెర్ల సర్వేనెంబర్ 59లో మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి నిర్మిస్తున్న బహుళ అంతస్తుల నిర్మాణంపై వివాదం కొనసాగుతోంది. ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి తనకు గల పూర్తి విస్తీర్ణాన్ని అమ్ముకుని తిరిగి మరికొంత ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి బహుళ అంతస్తుల నిర్మాణం చేయబడుతున్నాడనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సర్వే నెంబర్ 59లో ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డికి రికార్డు ప్రకారం 4.12 ఎకరాల విస్తీర్ణం గల భూమి మాత్రమే ఉంది. గతంలో చెంగిచెర్ల గ్రామపంచాయతీ నుండి 4.12 ఎకరాల విస్తీర్ణం గల భూమిలో లేఅవుట్ చేసి ప్లాట్లను విక్రయించాడు. ఇట్టి భూమికి ప్రక్కనగల సర్వేనంబర్ 57లో చింతలకుంట చెరువు ఉంది. దీన్ని ఆసరా చేసుకున్న ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి సర్వేనెంబర్ 57 ప్రభుత్వ భూమిలో బహుళ అంతస్తుల నిర్మాణం చేపడుతున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి. తనకు గల పూర్తి విస్తీర్ణాన్ని ప్లాట్లు చేసి విక్రయించి మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డికి అపార్ట్మెంట్ నిర్మించేందుకు భూమి ఎక్కడినుండి వచ్చిందంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కాగా, దీనిపై బోడుప్పల్ నగర డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ హైడ్రా కమిషనర్ రంగనాథ్ లో బుధవారం కలిశారు. ఈ మేరకు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి నిర్మిమిస్తున్న భౌల అంతస్తుల నిర్మాణాన్ని నిలిపి వేయించాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను కోరుతూ ఫిర్యాదు అందజేశారు. అనంతరం బోడుప్పల్ నగర డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ మాట్లాడుతూ.. చెంగిచెర్ల లోని సర్వేనెంబర్ 59లో ప్లాట్లు చేసి అమ్మివేసిన మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తిరిగి అపార్ట్మెంట్ నిర్మాణం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పూర్తి విస్తీర్ణాన్ని విక్రయించిన ఆయనకు భూమి ఎక్కడి నుండి వచ్చిందో బహిరంగ పరుచాలన్నారు. సర్వేనెంబర్ 52 చింతలకుంట చెరువు విస్తీర్ణం, సర్వే నంబర్ 59 పూర్తి విస్తీర్ణాన్ని సర్వే చేయించాలని హైడ్రా కమిషనర్ ను కోరినట్లుగా వారు వెల్లడించారు. ఈ రెండు సర్వే నెంబర్లను సర్వే చేయిస్తే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి నిర్మిస్తున్న అపార్ట్మెంట్ అక్రమమా.? సక్రమమా..? అనేది తెలుస్తుందని వారు వివరించారు. అప్పటివరకు మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి నిర్మిస్తున్న అపార్ట్మెంట్ ను నిలిపి వేయించాల్సిందిగా హైడ్రా కమిషనర్ను కోరినట్లుగా వారు వెల్లడించారు. ఈ నిర్మాణం వల్ల చింతల చెరువు భవిష్యత్తుకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసిన వారిలో నగర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కుర్రి శివశంకర్ తదితరులు ఉన్నారు.

## నార్సింగిలో మారియో క్లెయిర్ సెలూన్ ప్రారంభోత్సవంలో బిగ్ బాస్ సెలబ్రిటీల సందడి



**నార్సింగి,నేడున్యూస్:** ప్రఖ్యాత మెన్, వుమెన్ సెలూన్ మారియో క్లెయిర్ సెలూన్ నార్సింగిలో ప్రారంభమైంది. ఈ సెలూన్ ప్రారంభోత్సవంలో పలువురు బిగ్ బాస్ సెలబ్రిటీలు అతిథులుగా పాల్గొని సందడి చేశారు. ఆధునిక ప్యాషన్, అందానికి ఫ్రెంచ్ స్టైల్ ను మోడల్ గా చెబుతుంటారు. అలాంటి ఫ్రెంచ్ బ్యూటీని నగరవాసులు కూడా మారియో క్లెయిర్ ద్వారా పొందవచ్చని నిర్వాహకులు స్వర్ణ తెలిపారు. నార్సింగి మారియో క్లెయిర్ సెలూన్ లో క్రియేటివ్ హెయిర్ మేకోవర్, బ్రైడల్ ప్యాకేజెస్, గ్లోబల్ కలర్, వ్యాక్సింగ్, స్మూతింగ్, కెరాటిన్, మేకప్, బ్యూటీ అండ్ స్కిన్ సర్వీసెస్ మెన్ అండ్ వుమెన్ కు అందిస్తామని అమె వెల్లడించారు. నార్సింగ్ స్థానికులు మరింత అందంగా కనిపించేందుకు, వారి ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు మారియో క్లెయిర్ సెలూన్ లో ఎన్నో బెస్ట్ బ్యూటీ ప్యాకేజెస్ ఉన్నాయని నిర్వాహకులు స్వర్ణ అన్నారు.

## ఘనంగా వాసవి మాత విగ్రహ ప్రతిష్ట వేడుకలు

**భారీగా తరలివచ్చిన ఆర్యవైశ్యులు**



**నకిరేకల్,నేడున్యూస్:** గత ఐదు రోజుల నుండి జరుగుతున్న వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు బుధవారం కన్నుల పండుగగా అత్యంత భక్తిశ్రద్ధలతో ముగిసాయి ఈ వేడుకలకు రాష్ట్ర జిల్లాల నలుమూలల నుండి ఆర్యవైశ్యులు భారీగా తరలివచ్చారు దీంతో పట్టణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకొని పట్టణ వీధులు సందడిగా మారాయి.. ఆలయ నిర్మాణానికి దాతల సహకారంతో సంకల్పం చేసిన శ్రీమతి బ్రహ్మదేవర పద్మ కృష్ణమూర్తి నేతృత్వంలో వేడుకలు కనీ వినీ ఎరుగని రీతిలో జరిగాయి.నకిరేకల్ పట్టణంలో నూతనంగా నిర్మించిన వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. బుధవారం ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవాచనము, పంచగవ్యం, యంత్ర, శ్రీచక్ర ధ్వజ ప్రతిష్ట,వాసవి కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ట, జీవన్యాస, మహా పూర్ణాహుతి, ఆచార్య పూజ, అగ్నిప్రదక్షిణ దృష్టి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవీందర్, మున్సిపల్ చైర్మన్ రజిత శ్రీనివాస్, వైస్ చైర్మన్ మురారి శెట్టి ఉమారాణి కృష్ణమూర్తి తదితరులు వేరువేరుగా ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆర్యవైశ్య సంఘం మండల పట్టణ అధ్యక్షులు బ్రహ్మదేవర రామ్మోహన్ వీర్ల పాటి నరసింహారావు గర్రె మురళి బ్రహ్మదేవర రమేష్ ఆలయ స్థల దాతలు గర్రే రామ్మూర్తి వెంకటలక్ష్మి, బ్రహ్మదేవర విశ్వనాథం అరుణ, బ్రహ్మదేవర లక్ష్మయ్య సువర్ణ, బ్రహ్మదేవర పద్మ కృష్ణమూర్తి, గర్రె వెంకన్న, శ్రీనివాస్, వీర్లపాటి రాంబాబు, బ్రహ్మదేవర నరసింహారావు, వీర్లపాటి కృష్ణ, గర్రె మురళీమోహన్, బ్రహ్మదేవర రమేష్, రామకృష్ణ, పోతుగంటి రామ్మూర్తి, సోమా అశోక్,వీర్లపాటి లక్ష్మణ్ బాబుతో పాటుజిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ డ్రైవ్ పనుల పరిశీలన

**బేగంబజార్, నేడున్యూస్:** జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ ఓ అండ్ ఎం డివిజన్-4 పరిధిలో పర్యటించారు. 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఫీల్‌ఖానా ప్రాంతంలో జరుగుతున్న సీవరేజ్ డీ-సిల్టింగ్ పనుల్ని ఆయన తనిఖీ చేశారు. సీవరేజ్ ఔట్‌లెట్ సమస్య, ఏఎంఎస్ కింద జరుగుతున్న పనుల్ని పరిశీలించారు. అంతే కాకుండా గౌలిగూడ సెక్షన్‌లో బిల్లింగ్, కలెక్షన్స్, మీటర్ రీడర్స్ పనితీరు, ఓటీఎస్ పథకంపై సమీక్ష నిర్వహించారు.పర్యటనలో ఈడీ వెంట జీఎం, డీజీఎం, మేనేజర్లు ఉన్నారు.



# గోల్డ్ లోన్ చెల్లింపుల్లో ఇబ్బందులకు చెక్..



అత్యవసర పరిస్థితుల్లో చాలామంది ఆర్థిక అవసరాల కోసం బంగారాన్ని తాకట్టుపెట్టి రుణాలు తీసుకుంటారు. ఈ రుణాలు సురక్షితంగా ఉంటాయి. ప్రస్తుతం బంగారం రుణాలను వడ్డీతో కలిపి అసలు కలిపి చెల్లించాల్సిందే. దాంతో చాలామంది వడ్డీతో కలిపి గడువులోగా తిరిగి చెల్లించడం ఇబ్బందికరంగా మారుతున్నది. దాంతో బంగారు ఆభరణాలు వేలానికి వెళ్లే పరిస్థితి నెలకొంది. త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపబోతున్నది రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా. బంగారం ఆభరణాలపై తీసుకునే రుణాలను ఈఎంఐ రూపంలో చెల్లించే సదుపాయాన్ని తీసుకురావాలని యోచిస్తున్నట్లు తెలుస్తున్నది. బంగారు రుణాల మంజూరులో అవకతవకల నేపథ్యంలోనే ఈఎంఐ విధానం అయితే బాగుంటుందని ఆర్‌బీఐ భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.వాస్తవానికి, బంగారు ఆభరణాలపై రుణాలు ఇవ్వడంలో చాలా అక్రమాలు జరుగుతున్నాయని సెప్టెంబర్ 30న ఆర్బీఐ సర్క్యులర్‌లో పేర్కొంది. బంగారంపై రుణాలు అందించే సంస్థల పనితీరులో అవకతవకలు జరిగినట్లు ఆర్‌బీఐ గుర్తించింది. రుణాల సోర్సింగ్, మదింపు కోసం ఉపయోగించే థర్డ్ పార్టీల్లో అనేక లోపాలు ఉన్నాయనే ఆరోపణలున్నాయి. ఆభరణాల వేలంలోనూ పారదర్శకత లేదనే విమర్శలు ఉన్నాయి. ఇదిలా ఉండగా.. ఇటీవల గోల్డ్ రుణాల్లో భారీగానే వృద్ధి ఉందని రేటింగ్ ఏజెన్సీ ఐసీఆర్ఏ అభిప్రాయపడింది. వ్యవస్థీకృత రుణదాతల పోర్ట్‌ఫోలియో మార్చి 2025 నాటికి రూ.10 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా. సెప్టెంబర్ 30 నాటికి బ్యాంకుల ఆభరణాల రుణాలు 51 శాతం పెరిగి రూ.1.4 లక్షల కోట్లకు చేరినట్లు ఆర్‌బీఐ గణాంకాలు పేర్కొన్నాయి.

# హైదరాబాద్ ఆఫీస్‌కు గిరాకీ నై

తగ్గిన కొత్త ఆఫీస్ స్పేస్ సప్లై, లీజింగ్
25 శాతం చొప్పున పతనం
జూలై-సెప్టెంబర్‌కుగాను వెస్టియన్ నివేదిక
తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దాదాపు పదేండ్లపాటు అత్యధిక డిమాండ్‌ను చూసిన హైదరాబాద్ రియల్టీకి ఇప్పుడు ఆదరణే కరువైపోయింది.అటు హౌజింగ్ మార్కెట్, ఇటు ఆఫీస్ మార్కెట్ రెండూ కుప్పకూలుతున్నాయి మరి. ఎన్నో ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీలు విడుదల చేస్తున్న వరుస నివేదికలే ఇందుకు నిదర్శనం.తాజాగా దేశీయ రియల్టీపై అందులో హైదరాబాద్ ఆఫీస్ మార్కెట్ తీరుతెన్నులపై రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ వెస్టియన్ ఓ రిపోర్టునిచ్చింది. ఇందులో ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో ఆఫీస్ స్పేస్ సప్లై, లీజింగ్ 25 శాతం పడిపోయినట్టు తేలింది.న్యూఢిల్లీ, నవంబర్ 19: హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పరుగులకు బ్రేక్ పడిందా?.. సుమారు దశాబ్దకాలం కనిపించిన డిమాండ్ ఇప్పుడు కనుమరుగైపోతున్నదా?.. అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. కన్సల్టెన్సీ ఏదైనా.. చెప్పేది మాత్రం ఒక్కటే. అదే.. హైదరాబాద్ నిర్మాణ రంగంలో నిస్తేజం ఆవరిస్తున్నదని. ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ వెస్టియన్ విడుదల చేసిన తాజా నివేదిక సైతం ఇదే చెప్తున్నది. మంగళవారం వచ్చిన ఈ రిపోర్టు.. హైదరాబాద్‌లోని ఆఫీస్ స్పేస్‌కు గిరాకీ అంతంతమాత్రంగానే ఉన్నట్టు తేల్చింది. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో మార్కెట్‌లోకి కొత్తగా అందుబాటులోకి వచ్చిన ఆఫీస్ స్పేస్ గతంతో చూస్తే 25 శాతం తగ్గినట్టు పేర్కొన్నది. 4.1 మిలియన్ చదరపు అడుగులకే పరిమితమైనట్టు స్పష్టం చేసింది. అలాగే ఇదే సమయంలో లీజింగ్ కార్యకలాపాలు సైతం 25 శాతం క్షీణించి 2.79 మిలియన్ చదరపు అడుగుల వద్దే ఉన్నట్టు వెల్లడైంది.

**రివర్స్ గేర్‌లో..**

దేశవ్యాప్తంగా కార్పొరేట్ కంపెనీలకు తమ కార్యాలయాల ఏర్పాటుకు ముందు గుర్తొచ్చేదే హైదరాబాద్. ఒకప్పుడు బెంగళూరు, ముంబైలకు ఈ ఘనత దక్కినా.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో సుమారు పదేండ్లపాటు అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, అందించిన సహకారంతో ఆ నగరాల స్థానంలోకి హైదరాబాద్ వచ్చి చేరింది. ఐటీ, ఐటీ అనుబంధ రంగాలు, ఫార్మా, బయోసైన్స్, ఏవియేషన్, డాటా సెంటర్లు ఇలా అన్నింటికీ హైదరాబాదే ప్రధాన కేంద్రంగా విరాజిల్లింది. కానీ ఇప్పుడు ఆ ఉత్సాహం సన్నగిల్లింది. హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్‌ను లీజుకు తీసుకొనేందుకు ఎవరూ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీంతో ఆఫీస్ స్పేస్ సప్లై కూడా అందుకు తగ్గట్టుగానే తగ్గుతూ వస్తున్నది. దీనిపై రియల్టీ వర్గాల్లో ఆందోళనలు పెరుగుతున్నాయి.

# బిజినెస్

## ఫ్యామిలీతో కలిసి ఓటేసిన ముకేశ్ అంబానీ




మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కొనసాగుతోంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకూ కొనసాగనుంది. ఈ నేపథ్యంలో సినీ, రాజకీయ, క్రీడా, వ్యాపారవేత్తలు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. తాజాగా రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ ముంబైలోని ఓ పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. తన కుమారులు ఆకాశ్ అంబానీ, అనంత్ అంబానీ, కోడలు శ్లోకా మెహతాతో కలిసి ఓటు వేశారు.మహారాష్ట్రలో మొత్తం 288 శాసనసభ నియోజకవర్గాలకు పోలింగ్ జరుగుతోంది. 9.63 కోట్ల మంది ఓటర్లు 4 వేల 136 మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఈవీఎంలలో నిక్షిప్తం చేయనున్నారు. సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగనుండగా 31 సమస్యాత్మాక ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనున్నది. ఈ నెల 23 మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

# సినిమా

## డైరెక్టర్ స్పందన ఇదే..!

దర్శకుడు వంశీ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. రచయితగాను ఆయనకు మంచి పేరున్నది. ఆయన సినిమాలకు ఇప్పటికీ ఎంతో మంది అభిమానులు ఉన్నారు. సీనియర్ నటి భానుప్రియను సినిమా ఇండస్ట్రీకి పరిచయం చేసింది ఆయనే. ఆయన దర్శకత్వంలో భానుప్రియ సితార, అన్వేషణ, ఆలాపన తదితర సినిమాలో నటించింది. ఈ సినిమాలు ఎవర్‌గ్రీన్‌గా నిలిచిపోయాయి. తాజాగా ఓ మీడియా ఇంటర్వ్యూలో దర్శకుడు వంశీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అనేక అంశాలపై ప్రస్తావంచారు. కెరియర్ మొదటల్లో ఏ సినిమా చేస్తే బాగుంటుందనే విషయంలో తన సలహాలు, సూచనలను భానుప్రియ అడిగి తెలుసుకుంటుండేదని చెప్పారు.గ్లామరస్, మోడ్రన్ లుక్‌లో కనిపించే రోల్స్ తనకు రావడం లేదనే అంతృప్తికి గురయ్యేదని వంశీ గుర్తు చేసుకున్నారు. దాంతో అన్వేషణ మూవీలో మోడ్రన్‌గా కనిపించే అమ్మాయిలా చూపించానన్నారు. అప్పటి నుంచే ఆ తరహా పాత్రలు వచ్చాయని భానుప్రియ చెప్పిందని తెలిపారు. భానుప్రియ చూసి దాదాపు 35 సంవత్సరాలు అవుతుందని తెలిపారు. ఇదిలా ఉండగా.. భానుప్రియను పెళ్లి చేసుకోవాలని డైరెక్టర్ వంశీ భావించినట్లు ఆ రోజుల్లో ప్రచారం జరిగిందే. ఈ విషయంపై ఆయనను ప్రశ్నించగా.. ఆయన స్పందించలేదు. అదంతా గతమని.. చాలా ఏళ్లనాటి పాత కథ అంటూ దాటవేశారు. ఈ రోజు వరకు నాకు ఎవరూ లేరని.. తన భార్య కూడా చనిపోయిందని వాపోయారు. ఇద్దరు కూతుళ్లు ఉన్నారని.. ఒకరు హైదరాబాద్ ఒకరు, చెన్నైలో మరొకరు స్థిరపడ్డారని చెప్పారు. మొదటి నుంచి పిల్లలిద్దరికీ సినిమాలపై పెద్దగా ఆసక్తి లేదంటూ వంశీ వివరించారు.





## క్రేజీ టాక్ నిజమయ్యేనా..?

ఇటీవలే దేవర సినిమాతో బాక్సాఫీస్‌ను షేక్ చేశాడు గ్లోబల్ స్టార్ యాక్టర్ జూనియర్ ఎన్టీఆర్. ప్రస్తుతం దేవర పార్టు 2తోపాటు కేజీఎఫ్ ఫేం ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లోమూవీని కూడా లైన్‌లో పెట్టాడని తెలిసిందే. ఇప్పటికే ఈ చిత్రం గ్రాండ్‌గా పూజా కార్యక్రమాలతో లాంచ్ అయింది. దీంతోపాటు హిందీ ప్రాజెక్ట్ వార్ 2 షూటింగ్‌తో కూడా బిజీగా ఉన్నాడు.కాగా ఇప్పుడు తారక్ కొత్త సినిమాకు సంబంధించిన వార్త ఒకటి ఇండస్ట్రీ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. తాజా టాక్ ప్రకారం జైలర్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్‌తో సినిమాకు రెడీ అవుతున్నాడట. టాలీవుడ్‌లో వన్ ఆఫ్ ది లీడింగ్ బ్యానర్‌గా కొనసాగుతున్న సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనుందని ఇన్‌సైడ్ టాక్. ప్రస్తుతం తారక్ ప్రశాంత్ నీల్ సినిమాతోపాటు వార్ 2 ను పూర్తి చేయాల్సి ఉంది. ఈ ప్రాజెక్టుల షూటింగ్ పూర్తవగానే నెల్సన్ దిలీప్ కుమార్ సినిమాపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయని ఫిలింనగర్ సర్కిల్ టాక్. ఒకవేళ ఇదే నిజమైతే తారక్‌తో చేయబోయే సినిమా సితార ఎంటర్‌టైన్‌మెంట్‌కు భారీ పాన్ ఇండియా సినిమాగా అరుదైన మైల్‌స్టోన్ అవడం ఖాయమైనట్టే.

## ఉపేంద్ర యూఐ తెలుగు వెర్షన్ రిలీజ్ చేస్తుందెవరో తెలుసా..?




కన్నడ స్టార్ హీరో ఉపేంద్ర నటిస్తోన్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'యూఐ. ఉపేంద్ర కథనందిస్తూ.. డైరెక్ట్ చేస్తున్నాడు. రీష్మా నానయ్య ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటి పోషిస్తోంది. చాలా రోజుల తర్వాత ఈ మూవీ తెలుగు వెర్షన్‌కు సంబంధించిన ఆసక్తికర వార్తను షేర్ చేశారు మేకర్స్. యూఐ పంపిణీ హక్కులను పాపులర్ డిస్ట్రిబ్యూషన్ హౌస్ అల్లు అరవింద్ సారథ్యంలోని గీతా ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ సొంతం చేసుకుంది.ఈ తుఫాను గతంలో ఎన్నడూ లేనంత పెద్దదిగా ఉండబోతుంది.. అంటూ షేర్ చేసిన తాజా వార్తతో సినిమాపై తెలుగు ప్రేక్షకుల్లో అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. మనోహరన్- శ్రీకాంత్ కేపి సంయుక్తంగా తెరకెక్కిస్తున్న ఈ మూవీకి కాంతార ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.ఉపేంద్ర అశ్వంపై యుద్ధవీరుడిలా కనిపిస్తున్న లుక్‌తోపాటు మేకింగ్‌లో హిస్టరీ.. సినిమాను మరోసారి పునర్నిర్వచించేందుకు డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలోకి ఎంట్రీ ఇవ్వబోతున్నాడని మరోసారి తెలియజేశారు.ఈ చిత్రాన్ని కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ఇప్పటికే లాంచ్ చేసిన సౌండ్ ఆఫ్ యూఐ సినిమా ఎలాంటి థీమ్‌తో ఉండబోతుందో హింట్ ఇచ్చేస్తూ .. క్యూరియాసిటీ పెంచేస్తుంది. ఈ మూవీని లహరి ఫిలిమ్స్, వీనస్ ఎంటర్‌టైనర్స్ సంయుక్త నిర్మాణంలో తెరకెక్కిస్తున్నారు.

## డాడీస్ ప్రిన్సెస్..



టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆయనకు సోషల్ మీడియాలో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. బన్నీ సోషల్ మీడియాలో ఎంత ఫేమస్సో .. ఆయన గారాల పట్టి అల్లు అర్హ కూడా అంతే ఫేమస్. ఇక నెట్టింట తండ్రీ కూతురు చేసే అల్లరి అంతా ఇంతా కాదు. వీరిద్దరికి సంబంధించిన వీడియోలను బన్నీ భార్య అల్లు స్నేహ రెడ్డి ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా పంచుకుంటుంటారు. అవి చూసిన బన్నీ ఫ్యాన్స్ తెగ ఖుషీ అవుతుంటారు. వీడియోల్లో అర్హ తన ముద్దు ముద్దు మాటలతో నెటిజన్లను ఆకట్టుకుంటుంటుంది.తాజాగా అర్హపై ఓ ఆసక్తికర పోస్ట్ పెట్టారు ఈ ఐకాన్ స్టార్. 'అల్లు అర్హ అంటే డాడీస్ డాటర్ అనుకుంటివా.. డాడీస్ ప్రిన్సెస్' అంటూ పుష్ప చిత్రంలోని పుష్పరాజ్ స్టైల్లో రాసుకొచ్చారు. ఈ మేరకు కుమార్తెతో ఉన్న క్యూట్ ఫొటోను పంచుకున్నారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది.అల్లు అర్జున్ నటిస్తున్న తాజా చిత్రం పుష్ప ది రూల్. సుకుమార్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 05 వరల్డ్‌వైడ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. పుష్ప-2లో రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నది. ఫహాద్ ఫాజిల్, రావు రమేశ్, సునీల్, అనసూయ భరద్వాజ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా.. సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్స్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.

## చైనాను ఓడించిన మహిళల జట్టు

భారత మహిళల హాకీ జట్టు అద్భుత ప్రదర్శనతో ఆసియా కప్ టైటిల్‌ని నెగ్గింది. ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో చైనాను 1-0తో ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. తద్వారా భారత మహిళల జట్టు మూడోసారి టైటిల్‌ను కైవసం చేసుకుంది. మూడో క్వార్టర్‌లో దీపికా భారత్ తరపున గోల్ చేయడంతో గెలుపు వరించింది. 31వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌లో దీపిక గోల్ చేసి జట్టుకు ఆధిక్యాన్ని అందించింది. నిర్ణీత సమయానికి చైనా జట్టు గోల్ చేయకపోవడంతో ఓటమిపాలు కావాల్సి వచ్చింది. టోర్నీ దక్షిణ కొరియా మూడుసార్లు విజేతగా నిలువగా.. టీమిండియా సమం చేసింది.బిహార్ స్పోర్ట్స్ యూనివర్సిటీ స్టేడియంలో జరిగిన ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగింది. మ్యాచ్‌లో ఆద్యాంతం రాణించి.. అద్భుతమైన ప్రదర్శనతో టైటిట్‌ను కాపాడుకోగలిగింది. ఫైనల్‌లో భారత్‌కు చైనా గట్టి పోటీ ఇచ్చింది. దాంతో తొలి రెండు క్వార్ట్స్‌లో ఇరుజట్లు గోల్స్ చేయలేకపోయాయి. అయితే, మూడో క్వార్టర్స్‌లో దీపికా గోల్ చేసి భారత్‌ను ఆధిత్యంలో వెళ్లేలా చేసింది. ఈ టోర్నీలో దీపికకు ఇది 11వ గోల్‌కావడం విశేషం. గతేడాది రాంచీలో 2016లో సింగపూర్‌లో ఈ టైటిల్‌ను గెలుచుకున్న భారత జట్టు అద్భుతంగా సమన్వయం చేస్తూ ఓపికతో చైనాను నిలువరించింది. తొలి అర్ధభాగంలో ఎలాంటి గోల్ చేయకపోయినా.. ద్వితీయార్థం తొలి నిమిషంలో దీపికా పెనాల్టీ కార్నర్‌లో గోల్ చేసి అభిమానుల్లో జోష్ నింపింది.మూడో క్వార్టర్‌లోనే భారత్‌కు ఆధిక్యాన్ని రెట్టింపు చేసే సువర్ణావకాశం లభించింది.



అయితే 42వ నిమిషంలో పెనాల్టీ స్ట్రోక్‌లో దీపిక కొట్టిన షాట్‌ను చైనా గోల్‌కీపర్ కుడివైపు డైవ్ చేసి కాపాడింది. మూడో క్వార్టర్‌లో భారత్‌కు పెనాల్టీ కార్నర్ లభించినా.. గోల్‌గా మలచలేకపోయారు. అయితే, మ్యాచ్ చివరలో మరోసారి భారత క్రీడాకారులు తడబడ్డారు. జపాన్‌తో జరిగిన సెమీఫైనల్స్‌లో 16 పెనాల్టీ కార్నర్‌లో ఒక్కదాన్ని కూడా గోల్స్‌గా మలచలేకపోయిన విషయం తెలిసిందే. ఫైనల్‌లో మొదటి 30 నిమిషాల్లోనూ నాలుగు పెనాల్టీ కార్నర్ వృథా అయ్యాయి. పెనాల్టీ కార్నర్‌లో గోల్ సాధించడం భారత్‌కు బలహీనంగా మారింది.

## ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ విడుదల..



ఐసీసీ తాజాగా టీ20 ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో వరుస సెంచరీలు సాధించిన టీమిండియా యువ స్టార్ బ్యాటర్ తిలక్ వర్మ ఏకంగా 69 స్థానాలను మెరుగుపరుచుకొని ఏకంగా టాప్-కి చేరుకున్నాడు. తిలక్ టీ20 బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో టాప్-10లో చోటు సంపాదించడం ఇదే తొలిసారి. ఇంగ్లండ్ ఆటగాడు లియామ్ లివింగ్‌స్టోన్‌ను వెనక్కి నెట్టి భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా నెంబర్ వన్ ఆల్ రౌండర్‌గా నిలిచాడు. ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో పాండ్యా బ్యాట్‌తో పాటు బాల్‌తోనూ అద్భుత ప్రదర్శన చేశాడు. నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌ను టీమిండియా 3-1 తేడాతో గెలుచుకున్నది. టీ20 ఆల్‌రౌండర్ల జాబితాలో హార్దిక్ నంబర్ వన్ ర్యాంక్‌కు చేరుకోవడం ఇది రెండోసారి. ఐసీసీ తాజా ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా ఆటగాడు మార్కస్ స్టోయినిస్ నాలుగో స్థానంలో, శ్రీలంక మాజీ కెప్టెన్ వనిందు హసరంగ ఐదో స్థానంలో నిలిచారు. దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో టీమిండియా యువ ఆటగాడు తిలక్ 280 పరుగులు సాధించాడు. ఇందులో రెండు సెంచరీలు ఉన్నాయి. దాంతో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో 69 స్థానాలను మెరుగుపరుచుకొని మూడోస్థానానికి చేరుకున్నాడు.నెంబర్ వన్ బ్యాట్స్‌మెన్‌గా ఆస్ట్రేలియా ఆటగాడు ట్రావిస్ హెడ్ కొనసాగుతుండగా.. రెండోస్థానంలో ఇంగ్లండ్ ఆటగాడు ఫిల్ సాల్ట్ ఉన్నాడు. ఇక టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఒక స్థానం దిగజారి నాలుగో స్థానానికి చేరుకున్నాడు. దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో రెండు సెంచరీలు సాధించిన సంజూ శాంసన్.. టీ20 బ్యాట్స్‌మెన్ ర్యాంకుల జాబితాలో 17 స్థానాలను మెరుగుపరుచుకొని 22వ స్థానానికి చేరాడు. ట్రిస్టన్ స్టబ్స్ మూడు స్థానాలు ఎగబాకి 23వ స్థానానికి, హెన్రిచ్ క్లాసెన్ ఆరు స్థానాలు ఎగబాకి 59వ స్థానానికి చేరుకున్నారు. శ్రీలంక కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్ కుశాల్ మెండిస్ టీ20 బ్యాట్స్‌మెన్ ర్యాంకింగ్స్‌లో 12వ ర్యాంక్‌కు చేరుకోగా, వెస్టిండీస్‌కు చెందిన షాయ్ హోప్ 16 స్థానాలు ఎగబాకి 21వ స్థానానికి చేరుకున్నాడు. కాగా, పాకిస్థాన్‌పై హాఫ్ సెంచరీ చేయడంతో ఆస్ట్రేలియా ఆటగాడు మార్కస్ స్టోయినిస్ 10 స్థానాలు ఎగబాకి 45వ స్థానానికి చేరుకున్నాడు. భారత ఫాస్ట్ బౌలర్ అర్షదీప్ సింగ్ మూడు స్థానాలు ఎగబాకి తొమ్మిదో స్థానానికి చేరుకున్నాడు. అతని కెరీర్లో ఇదే బెస్ట్ ర్యాంకింగ్ కావడం విశేషం.

## ఫుట్‌బాల్ అభిమానులకు గుడ్‌న్యూస్..

తిరువనంతపురం: ఫుట్‌బాల్ లెజెండరీ ప్లేయర్ లియోనిల్ మెస్సితో పాటు అర్జెంటీనా జట్టు వచ్చే ఏడాది కేరళలో పర్యటించనున్నారు. అక్కడ ఓ ఇంటర్నేషనల్ మ్యాచ్ ఆడనున్నారు. కేరళ క్రీడాశాఖ మంత్రి అబ్దురహ్మాన్ ఈ విషయాన్ని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోనే ఆ మ్యాచ్‌ను నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. అర్జెంటీనా జట్టు కేరళలో రెండు మ్యాచ్‌లు ఆడనున్నట్లు ఆయన తెలిపారు. కొచ్చి వేదికను ఖరారు చేశారు.అయితే అర్జెంటీనాతో తలపడే జట్టు కోసం ఇంకా అంచనా వేస్తున్నారు. ఖతార్ లేదా జపాన్‌తో అర్జెంటీనా తలపబడే అవకాశాలు ఉన్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అర్జెంటీనా ఫుట్‌బాల్ అసోసియేషన్‌తో స్పెయిన్‌లో జరిగిన చర్చలు దీనిపై నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. ఏఎఫ్ఏకు చెందిన బృందం త్వరలో కేరళలో పర్యటించనున్నారు. ఆ మ్యాచ్‌లకు స్పాన్సర్‌గా వ్యవహరించేందుకు కేరళ వ్యాపార సంఘాలు సిద్ధంగా ఉన్నట్లు మంత్రి చెప్పారు.



# స్పోర్ట్స్



## బుమ్రా కెప్టెన్సీపై బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ ప్రశంసల వర్షం..

టీమిండియా ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా నాయకత్వ సామర్థ్యంపై భారత జట్టు బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ ప్రశంసల వర్షం కురిపించాడు. ఆస్ట్రేలియా వేదికగా జరిగే బోర్డర్ గవాస్కర్ సిరీస్ కోసం టీమిండియా ఆస్ట్రేలియాకు చేరుకుంది. ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించింది. పెర్త్ వేదికగా జరిగే తొలిటెస్ట్‌కు రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ అందుబాటులో ఉండడం లేదు. ఇటీవల రోహిత్‌కు తనయుడు జన్మించిన విషయం తెలిసిందే. దాంతో కీలక సిరీస్‌లో తొలిమ్యాచ్‌కు రోహిత్ దూరమయ్యాడు. ఇక ప్రారంభ మ్యాచ్‌కు జస్ప్రీత్ బుమ్రా కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ సిరీస్‌కు ఈ మిస్టరీ బౌలర్‌ను సెలెక్షన్ కమిటీ వైస్ కెప్టెన్‌గా నియమించింది. బుమ్రా గతంలో 2022లో ఇంగ్లండ్‌తో జరిగిన ఐదోటెస్ట్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఆ మ్యాచ్‌లో భారత్ ఏడు వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో కూడా బుమ్రా వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఆస్ట్రేలియాతో జరిగే ఐదుటెస్టుల సిరీస్‌లో యువ ఫాస్ట్ బౌలర్లకు బుమ్రా మార్గనిర్దేశనం చేస్తాడని బౌలింగ్ కోచ్ మోర్కెల్ పేర్కొన్నారు.మీడియా సమావేశంలో మాట్లాడుతూ బుమ్రా కెప్టెన్సీ బాధ్యతలు చూసుకునేందుకు సిద్ధంగా ఉన్నాడని.. గతంలోనూ విజయవంతంగా జట్టును నడిపించాడన్నారు. అతనికి ఏం కావాలో తెలుసునని.. బౌలింగ్‌లో ముందు నుంచి నాయకత్వం వహిస్తాడని.. అతన్ని యువ బౌలర్లు అనుసరిస్తారన్నారు. విరాట్ కోహ్లి, కేఎల్ రాహుల్ వంటి ఆటగాళ్లతో బుమ్రా సలహాలు అవసరమైన సలహాలు సూచనలు తీసుకోగలడని.. అది కెప్టెన్‌గా ముందుకు సాగడంలో సహాయపడుతుందని మోర్కెల్ పేర్కొన్నారు. బుమ్రాకు ఇది పెద్ద సవాల్ అని.. కోహ్లి, రాహుల్ లాంటి అనుభవజ్ఞులు ఉన్నారన్నారు. ఆస్ట్రేలియా గడ్డపై బుమ్రాకు అద్భుతమైన రికార్డు ఉంది. ఏడు టెస్టు మ్యాచుల్లో 32 వికెట్లు పడగొట్టాడు. 2018-19, 2020-21 పర్యటనల్లో విజయం సాధించిన తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై భారత జట్టు వరుసగా మూడో సిరీస్‌ను కైవసం చేసుకోవాలని చూస్తోంది.

**Printed, Published and Owned by VELLENKI JAYAPAL REDDY**, Printed at M/s KAKATIYA PRINTERS, H.No: 24-91/72/1, Block No. 29, Plot Nos. 72,73 and 74, Laxminarayana NagarIDA Uppal, Uppal Mandal, Medchal-Malkajigiri Dist. Telangana- 39. Published at H.No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajigiri Dist. Telangana- 92,
**Editor: VELLENKI JAYAPALREDDY, Cell: 9133445456,9346984911, Chief Editor L . SHYAM SUNDER REDDY, RNI NO : TELTEL/2023/84471,**
Website: www.nedudailynews com, **e-mail: vellenkijayapalreddy@gmail.com.**